తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
జ్రో॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
మంగళవారం
22 సెప్టెంబర్ 2026
పేజీలు - 20

## అధికారులు సమన్వయంతో ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

- ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి నాగయ్య తన కుమారుడు తన భూమిలోకి రాకుండా అడ్డుకొని భయపెడుతున్నాడని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 5వ వార్డుకు చెందిన గుర్రం అంకమ్మ తాను చుట్టూ రేకులతో తాత్కాలిక ఇల్లు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కల్లు సునీత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, బిల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండలం గన్ పూర్ గ్రామానికి చెందిన కొట్టే అశోక్ తన తండ్రి పేరిట గల భూమి నిషేధిత జాబితాలో ఉందని, ఇట్టి భూమిని రికార్డుల ప్రకారం సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం కవ్వాల్ గ్రామ సర్పంచ్ తమ గ్రామపంచాయతీలో స్థానికంగా లేని కొంతమంది వ్యక్తులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంపై తగు విచారణ జరిపి ఓటరు జాబితా ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన జి. శైలజ తాను కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఫిజిక్స్ గెస్ట్ టీచర్ గా విధులు మిగతా 12లో..

## ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించిన వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జె. చోంగ్తూ
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టియానా జె. చొంగ్తు,ఐఏ ఎస్ ,వైద్య ఆరోగ్య శాఖ సంచాలకు డాక్టర్ వాణి లతో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య సోమవారం సందర్శించారు. తొలుత ఆరోగ్యశ్రీ వార్డును పరిశీలించారు. ఆదివారం ఈ వార్డులో పెచ్చులు ఊడిపడటానికి దారితీసిన పరిస్థితులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఏం.జి.ఏంలో అందుతున్న వైద్య సేవలు, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రి భవన స్థితిగతులపై ఆర్అండ్‌బీ ఈఈ నరేందర్‌రెడ్డి, టీఎస్ఎంఐడీసీ ఈఈ ప్రసాద్‌లను అడిగి తెలుసుకున్నారు.ఆస్పత్రి భవనాల భద్రత, నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అనంతరం ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది అందుబాటు, విధుల హాజరుపై ఆరా తీశారు.ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు.విధులకు సమయపాలనతో హాజరై రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణను కూడా సమీక్షించారు.రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రణాళికలు రూపొందించి అందుకు అనుగుణంగా రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దంపల్లి రోడ్డు పనుల్లో కదలిక..

- జోరుగా సాగుతున్న రోడ్డు పనులు
- ప్రారంభమైన వెలిశాల-రాఘువాపూర్ రోడ్డు పనులు
- 'జనంసాక్షి' ఎఫెక్ట్..





**టేకుమట్ల, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** జనంసాక్షి కథనంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఎట్టకేలకు రోడ్డు పనులను ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల-పెద్దంపల్లి-రాఘవపూర్ రోడ్డు పనులపై ఈ నెల 16న 'కదలని వెలిశాల-పెద్దంపల్లి రోడ్డు' పేరుతో జనంసాక్షిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. కాగా కథనానికి స్పందన లభించింది. వార్తను చూసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సంబంధిత అధికారులను వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించడంతో ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి.

2019 నవంబర్ 5న అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రూ.2.70 కోట్ల అంచనా వ్యయంతో ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కాంట్రాక్టర్ మట్టి పనులు చేపట్టి రూ.66 లక్షల బిల్లును పొందినప్పటికీ, రోడ్డు పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదు. గత కొన్ని

ఏళ్లుగా రోడ్డు పనులు నిలిచిపోవడంతో ప్రజలు, రైతులు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించి 2026 మే 1న రూ.80 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు పనులకు మరోసారి శంకుస్థాపన చేశారు. అయితే శిలాఫలకం ఏర్పాటు చేసి నాలుగు నెలలు గడిచినా పనులు ప్రారంభం కాకపోవడంపై కథనం ప్రచురితమైంది.

ఈ కథనంపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ ఏఈ, డీఈలను వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి రోడ్డు పనులు ప్రారంభించినట్లు కాంట్రాక్టర్ తెలిపారు.

రోడ్డు పనులను వారం నుంచి పది రోజుల్లో పూర్తి చేసి వాహనదారులు, రైతులు, విద్యార్థులకు రహదారి అందుబాటులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా ఏఈ, డీఈలు తెలిపారు. పనులు వేగంగా కొనసాగుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు. తమ చిరకాల సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడటంపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



## ధర్మసాగర్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభం

**ధర్మసాగర్ సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** ధర్మసాగర్ మండలం అధికార ప్రతినిధి ప్రమోద్ పాల్ పొలుమారి, ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెసరు రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్టేషన్గన్పూర్ మాజీ ఉప ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ హన్మకొండ జిల్లా అధ్యక్షులు ఎనుగాల వెంకట్రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీ హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రపు ప్రసాద్ హాజరై కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభోత్సవం చేసినారు తదనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి అమరవీరుల స్థూపం వరకు పటాసులు కాలుస్తూ ర్యాలీ నిర్వహించినారు ధర్మసాగర్ లోని సుస్మిత గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ సభలో పాల్గొన్నారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎనుగాల వెంకటరామిరెడ్డి నూతనంగా జిల్లా నాయకులను గ్రామా నాయకుల అధ్యక్షులను శాలువతో సన్మానించినారు. తదనంతరం హన్మకొండ జిల్లా ఎనుగాల వెంకటరామిరెడ్డి పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ధర్మ సార్ మండలంలో ఉన్న మీరు ఆయా పదవులను అందుకున్నారు రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఏ ఒక్కరూ పార్టీలైను దాటి వెళ్ళకూడదు గ్రామంలోని మండలంలోని జిల్లాలోని కార్యకర్తలకు ఆదర్శంగా నిలవాలని మీ అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు

## దోమల నివారణకు ఫాగింగ్ మిషన్

### ఆపరేషన్ విధానంపై కార్మికులకు అవగాహన



మల్లూర్, సెప్టెంబర్ 21(జనంసాక్షి)మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ కార్మికులకు ఫాగింగ్ మిషన్ ఆపరేషన్‌పై అవగాహన కల్పించారు. దోమల నివారణకు మిషన్‌ను ఎలా వినియోగించాలి, సురక్షితంగా ఎలా ఆపరేట్ చేయాలనే విధానాన్ని కార్మికులకు వివరించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఫాగింగ్ మిషన్‌ను అవసరమైన ప్రాంతాల్లో వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా స్ఫూర్తితో బీజేవైఎం రక్తదాన శిబిరం



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా భూపాలపల్లిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఉడత నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషిధర్ రెడ్డి, కౌన్సిలర్ యుగేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మోదీ సేవా స్ఫూర్తితో యువత సమాజ సేవలో ముందుండాలని నాయకులు పిలుపునిచ్చారు.

## డీజేలకు బ్రేక్.. ఏడుగురు నిర్వాహకుల బైండోవర్



చిట్యాల, సెప్టెంబర్ 21( జనం సాక్షి): గణేష్ నవరాత్రులు, నిమజ్జన ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, శబ్ద కాలుష్య నియంత్రణకు చిట్యాల పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని ఏడుగురు డీజే యజమానులు, ఆపరేటర్లను బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126 కింద తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు.అనుమతి లేకుండా అధిక శబ్దంతో డీజేలు, లేజర్ లైట్లు, భారీ సౌండ్ ట్రక్కులు వినియోగించరాదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే డీజే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, యువత, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

## వివాహిత అదృశ్యం... కేసు నమోదు



చిట్యాల, సెప్టెంబర్ 21( జనం సాక్షి): మండల కేంద్రంలోని నైనపాక గ్రామానికి చెందిన పెరుమాండ్ల లక్ష్మి (30) అనే వివాహిత అదృశ్యమైనట్లు తన భర్త దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నైనపాక గ్రామానికి చెందిన పెరుమాండ్ల దేవేందర్‌కు, లక్ష్మితో పదేళ్ల క్రితం వివాహమైంది. ఈ నెల 20న ఉదయం దేవేందర్ వ్యవసాయ పనికి వెళ్లగా, ఉదయం 10:00 గంటల సమయంలో లక్ష్మి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వచ్చిన భర్త, ఎంత వెతికినా లక్ష్మి ఆచూకీ లభించలేదు. దీంతో భర్త దేవేందర్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు.

## రక్తదానంలో ఉత్తమ సేవా పురస్కారం - 2026 అందుకున్న వరంగల్ పోలీస్ కానిస్టేబుల్,

### బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు)



నర్సంపేట సెప్టెంబర్ 21 ( జనం సాక్షి)వరంగల్ జిల్లాకు చెందిన కన్నె కుమారస్వామి - రమనీల దంపతుల పెద్ద కుమారుడు వరంగల్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో విధులు నిర్వహిస్తున్న ఎ.ఆర్ 2009 బ్యాచ్ పోలీస్ కానిస్టేబుల్ బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ కన్నె రాజు. (స్విమ్మర్ రాజు)కు యాదాద్రిభువనగిరి జిల్లా, ఆత్మకూర్ మండలం పి.యస్ ఫంక్షన్ హాల్ లో భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాలలో వివిధ రంగాలలో సేవాలందిస్తున్న రక్తదాతలకు - సమాజ సేవకులకు, ఉపాధ్యాయులకు ఉత్తమ సేవా పురస్కారం - 2026 అందడం జరిగింది.గత 21 సంవత్సరాలుగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రక్తదానం పై నేను స్వయంగా 38 సార్లు రక్తదానం చేశాను.అత్యవసర సమయంలో ఉన్న పేషెంట్లకు రక్తదాతల సహకారంతో 18,832 మందికి ఉచితంగా రక్తం అందించడం, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 86 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, కరోనా (కోవిడ్ - 19) సమయంలో 235 మందికి ప్లాస్మాదానం చేయించడం, దాతల సహకారంతో 430 రోజులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం, వీటితోపాటు విద్యాభివృద్ధి, వివిధ అంశాల పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, ఆర్థిక సహాయం, అవయవదానం పై అవగాహన మొదలైన కార్యక్రమాలు చేయడం.ముఖ్యంగా రక్తదానం పై 21 సంవత్సరాలుగా నేను చేస్తున్న సేవలను గుర్తించి భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ అధ్యక్షులు కురుమేటి నవీన్, ప్రధాన కార్యదర్శి హేమంత్ ఈ అవార్డుకి ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ బ్లడ్ డోనర్ డాక్టర్ సంపత్ కుమార్, సామాజిక కార్యకర్త సర్వ్ నీడ్ ఆర్గనైజర్ డాక్టర్ గౌతమ్ కుమార్, యంగ్ ఇండియా బ్లడ్ డోనర్స్ అధ్యక్షులు జె.బి బాలు . చేతుల మీదుగా " రక్తదానంలో ఉత్తమ సేవా పురస్కారం - 2026" ను తీసుకోవడం జరిగింది. నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ, నన్ను అనునిత్యం ప్రోత్సహిస్తున్న నా కుటుంబ సభ్యులు, నా యొక్క బంధుమిత్రులు, రక్తదాతలు, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులు, గురువులు, రాగంపేట గ్రామ ప్రజలకు, మరియు పోలీసు ఉన్నతాధికారులకు నా యొక్క ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ అవార్డును అందరికీ అంకితం చేస్తున్నాను.

## కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌కు మరమ్మత్తులు

### 'జనం సాక్షి' కథనానికి స్పందన



చెన్నారావుపేట, సెప్టెంబర్ 21 ( జనం సాక్షి): కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కు విద్యుత్ శాఖ అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేయించి త్రీఫేస్ విద్యుత్ ను సరఫరా చేశారు. ఈనెల 19న శనివారం 'జనం సాక్షి' దినపత్రికలో 'ఎండిపోతున్న పంట పొలాలు... కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్... తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న కాల్ నాయక్ తండావాసులు... పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు'... అని వచ్చిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించారు. కాల్ నాయక్ తండ గ్రామానికి వెళ్లి మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను తొలగించి నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేశారు. అంతేకాక త్రీఫేస్ విద్యుత్ ను సరఫరా పునరుద్ధరించారు. దీంతో రైతుల వ్యవసాయ బావులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా కావడంతో తమ ఎండిపోతున్న పంట పొలాలకు రైతులు సాగునీటిని సరఫరా చేసుకున్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీ నల్లాల బావి ద్వారా కూడా తండాలోని ఇంటింటికి తాగునీటి సరఫరాను అందించారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కు మరమ్మత్తులు జరిగే విధంగా త్రీఫేస్ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే విధంగా చూసి కాల్ నాయక్ తండాలో సాగు, త్రాగు నీరు అదేవిధంగా కథనాన్ని రాసి తమ సమస్యను పరిష్కరించినందుకు 'జనం సాక్షి'కి వార్డు సభ్యులు బానోతు వీరు, భూక్య శ్రీను, తండావాసులు, రైతులు గుగులోత్ నరేష్, బానోతు రమేష్, బానోతు జంపన్న, గుగులోతు స్వామి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పూర్వ చరిత్రను డాక్యుమెంటరీ రూపంలో వెలికితీయాలి

### ప్రిన్సిపాల్ అవునూరి అంజయ్య



బెల్లంపల్లి, సెప్టెంబర్ 21, (జనంసాక్షి)పూర్వ చరిత్రను డాక్యుమెంటరీ రూపంలో వెలికితీయాలని బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అవునూరి అంజయ్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర కళాశాలలో జ్ఞాన భారతి మిషన్ లో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత దేశ నాగరికతలు, చరిత్ర, సంస్కృతి అంశాలను వివిధ ప్రాంతాలలో శాసనాల ద్వారా అగ్రహారాల ద్వారా బురుజుల ద్వారా ఎన్నో రకాలైన ఆధారాలు కొన్ని గ్రామాలలో చోటు చేసుకున్నాయని, వాటి పూర్వ చరిత్రను డాక్యుమెంటరీ రూపంలో వెలికి తీయాలని అన్నారు. విద్యార్థులు వాటి చరిత్ర తెలుసుకోవాలని ప్రతి విద్యార్థి తన శైలిలో డాక్యుమెంటరీని రూపొందించాలని సూచించారు. కళాశాల ఇంగ్లీష్ అధ్యాపకుడు, స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ సింగతి ఉపేందర్ మాట్లాడుతూ శాసనాలు చరిత్రకు ఆధారాలు అని, వాటి గురించి బెల్లంపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉన్న కొన్ని చారిత్రక ప్రదేశాలను వివరించారు. అచలాపూర్, ఎల్లారం, బొక్కలగుట్ట, గాంధారి వనం, బుగ్గ జాతర మొదలైన ప్రదేశాల గురించి వాటి ప్రత్యేకతల గురించి వివరించారు. చరిత్ర అధ్యాపకుడు మల్లెల చంద్రయ్య మాట్లాడుతూ భారత దేశ వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు మొదలైన శాస్త్రాల గురించి, నాణాల గురించి, హిందూ నాగరికత, హరప్ప నాగరికత, స్త్రీల నాగరికత, మెసపటోమియా నాగరికతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఈ సోమయ్య డాక్యుమెంటరీ భాగంగా విద్యార్థులు గ్రామాలలో పెద్దల సహకారం తీసుకొని కొన్ని జాగ్రత్తలు తీసుకొని డాక్యుమెంటరీ తయారు చేసుకోవాలని సూచించారు.

## ణేష్ నిమజ్జన ఏర్పాట్లపై హిందూ ఉత్సవ కమిటీ సమావేశం

### సమావేశంలో పాల్గొన్న బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 21,(జనంసాక్షి ): నిర్మల్ పట్టణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా సోమవారం నిర్వహించిన ఉత్సవ కమిటీ సమావేశంలో బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేలా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో కౌన్సిలర్లు, పట్టణ బీజేపీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ గణనాథుని మండపం వద్ద “మహా అన్నదాన” వితరణ

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు



**పాలకుర్తి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి)** పాలకుర్తి మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తా లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దాతల సహకారంతో, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి లుగా మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సతీమణి. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు. బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఎర్రబెల్లి వినయ్ రావు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉషా దయాకర్ రావు మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని. అన్నదానం మహాదానమని పేర్కొన్నారు. గణనాథుడి ఆశీర్వాదంతో నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పండుగలు భక్తితో పాటు సేవాభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఆమె గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉషా దయాకర్ రావు. ఎర్రబెల్లి వినయ్ రావు లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్. పసునూరి నవీన్. కాటబత్తిని రమేష్. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పబ్బ సంతోష్. ఉప సర్పంచ్ గాదపాక కిరణ్. వార్డు సభ్యులు. ఉత్సవ కమిటీ సభ్యులు రేపాల అశోక్. చారగొండ్ల శివ. తాళ్ల రామకృష్ణ. కామారపు సునీల్. సింగ వెంకట్రాజు. ఆకుల నాగరాజు. తమ్మి రాంబాబు. రాపాక వెంకట్. చాట్ల శ్రీనివాస్. సింగ మహేందర్ రాజు. ముద్ర బోయిన సంతోష్. తదితర భక్తులు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు వేగంగా పూర్తి చేయాలి

## ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియాన ఆదేశాలు



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జె. చోంగ్తూ, ఐఏఎస్, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ వాణి సోమవారం వరంగల్‌లోని నూతనంగా నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులోకి రానున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా సంబధిత శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్శనలో సంబంధిత శాఖల అధికారులు వారి వెంట ఉన్నారు.

# గణేషుడికి నృత్య నీరాజనం అందించిన నటరాజ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు



**తాండూర్, సెప్టెంబర్ 21(జనం సాక్షి)**మంచిర్యాల జిల్లా :తాండూర్ మండలం లో శ్రీ గణేశ్ మండలి ఆధ్వర్యంలో పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న గణేశ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి భక్తిరస సాంస్కృతిక కార్యక్రమాలు మిన్నంటాయి. ఇందులో భాగంగా బెల్లంపల్లికి చెందిన ప్రముఖ ‘నటరాజ డ్యాన్స్ అకాడమీ’ విద్యార్థులు వినాయకుడికి సమర్పించిన కూచిపూడి నృత్య నీరాజనం భక్తులను విశేషంగా అలరించింది. నాట్య గురువు అర్చన జయప్రకాశ్ పర్యవేక్షణలో, ఆమె శిక్షణలో రూపుదిద్దుకున్న “వినాయక జన్మ రహస్యం” నృత్య రూపకాన్ని విద్యార్థులు స్టేజ్ పైన అత్యంత ప్రతిభావంతంగా ప్రదర్శించారు. వినాయకుని జన్మవృత్తాంతాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన ముద్రలు, అభినయం, శాస్త్రీయ సంగీత సమన్వయం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారుల హావభావాలు, లయబద్ధమైన నృత్య ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి హర్షధ్వానాలు, విశేష స్పందన లభించింది. నృత్య ప్రదర్శన అనంతరం స్థానిక లావణ్య సెలక్షన్ ఆధ్వర్యంలో ప్రతిభ చాటిన విద్యార్థినులకు ప్రత్యేకంగా షీల్డ్ లను అందజేసి బహుమతులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గణేశ్ మండలి నిర్వాహకులు, భక్తులు మరియు స్థానికులు నటరాజ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులను, వారిని ఎంతగానో తీర్చిదిద్దిన నాట్య గురువు అర్చన జయప్రకాశ్‌ను ఘనంగా అభినందించారు.

# కొండా లక్ష్మన్ బాపూజీ సేవలు మరువలేనివి

## ఘనంగా కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు



**పాలకుర్తి. సెప్టెంబర్ 21 (జనంసాక్షి)**స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని. పాలకుర్తి పట్టణ పద్మశాలి సంఘం నాయకులు అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ14వ వర్ధంతిని పురస్కరించుకొనికొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ కమిటీ ఆధ్వర్యంసోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ స్థలం వద్ద పట్టణ పద్మశాలి సంఘం నాయకులు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి పెనుగొండ రమేష్, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడారపు సుధాకర్, పోపా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిదురాల ఎల్లయ్య మాట్లాడుతూ కొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణకు ఎనలేని సేవలను అందించారని, తొలి దశ, మలిదశ ఉద్యమంలో తెలంగాణ కోసం లక్ష్మణ్ బాపూజీ పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని లెక్కచేయకుండా తృణ ప్రాయంగా వదిలేసిన గొప్ప మహానుభావుడు లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటే తన ఊపిరిగా జీవించి చైతన్యాన్ని కలిగించారని తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలు, సామాజిక సేవా స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోపాలకుర్తి పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు చిలుకమారి వెంకటేశ్వర్లు, బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులు పెనుగొండ వెంకటేశ్వర్లు. చిదురాల మార్కండేయ, చిలుకమారి సోమేశ్వర్, ఈగ శ్రీనివాస్, చిలుకమారి శ్రీధర్, ఎనగందుల శ్రీనివాస్, చిదురాల దేవేందర్, చిలుకమారి వరప్రసాద్, మార్గం సతీష్ లతో పాల్గొన్నారు.

# కరాటేలో సత్తా చాటిన సంస్కార్ స్కూల్ విద్యార్థి

## ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ కైవసం



**నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 21,(జనంసాక్షి )** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 13న నిర్వహించిన తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో సంస్కార్ స్కూల్ విద్యార్థి గాంధే రుద్రాన్స్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. మొదటి తరగతి చదువుతున్న రుద్రాన్స్ కరాటే పోటీల్లో ప్రతిభను ప్రదర్శించి గోల్డ్ మెడల్ సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. చిన్న వయసులోనే కరాటేలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అయ్యన్న గారి రచన రుద్రాన్స్‌ను అభినందించి ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో క్రీడారంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు పాఠశాల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. రుద్రాన్స్ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# కమలాపూర్ లో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు



**కమలాపూర్, సెప్టెంబర్ 21 (జనం సాక్షి ) :-** కమలాపూర్ మండల కేంద్రంలోని పద్మశాలి సహకార సంఘం ప్యాకేజ్ యూనిట్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ 14 వర్ధంతి వేడుకలను కమలాపూర్ పట్టణ పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి యూత్ అధ్యక్షుడు ఆడేపు శ్రీకాంత్ మాట్లాడుతూ దేశ స్వతంత్రం నుండి మొదలుకొని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు వరకు కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితమంతా ఒక నిరంతర పోరాటంగా మారిందన్నారు. 1969 ఉద్యమ సమయంలో తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటు కోసం తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్నారని గుర్తు చేశారు. పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే నాయకత్వమని తన ఆచరణతో చూపించిన గొప్ప దర్శనికుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. 96 సంవత్సరాల వయసులో కూడా ఎముకలు కొరికే చలినీ లెక్కచేయకుండా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం దీక్ష చేశారని తెలిపారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధన కోసం నేటి తరం పద్మశాలి యువత నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మెండు రమేష్, కమలాపూర్ పద్మశాలి కుల సంఘం ప్రధాన కార్యదర్శి మార్గం చైతన్య, క్యాషియర్ శ్రీకాంత్, సహాయ కార్యదర్శి చేరాల సాయి కృష్ణ, కమిటీ సభ్యులు ఉడుత సురేష్, గాజుల అరుణ్, చందనాల నాగరాజ్, బూర రాజు, తుమ్మ రఘుపతి, ఆడేపు సాంబయ్య, బైరి శివానందం, తుమ్మ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# నాగయ్య పల్లి లో మెడికల్ క్యాంపు నిర్వహణ



**ఆత్మకూర్, సెప్టెంబర్ 21( జనం సాక్షి):**ఆత్మకూరు మండలంలోని అక్కంపేట పల్లె దవాఖాన పరిధిలోని నాగయ్య పల్లి గ్రామంలో సోమవారం రోజు మెడికల్ క్యాంపు నిర్వహించారు . గ్రామం నందు ఇంటింటి జ్వర సర్వే చేసి జ్వర పీడితులకు జ్వర పరీక్షలు నిర్వహించి వారికి మందులు పంపిణీ అందజేశారు. అదేవిధంగా క్యాంపు నందు 64 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు గ్రామ సర్పంచ్ గుండాల క్రాంతి కుమార్, ఉపసర్పంచ్ నేరెళ్ల కర్ణాకర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి రవికుమార్ , వైద్య సిబ్బంది డాక్టర్ నరసింహారావు , సూపర్వైజర్ రమేష్ , హెల్త్ అసిస్టెంట్ సాంబయ్య ఏఎన్ఎం సరిత , ఆశాలు యశోద సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### బచ్చన్నపేట ఎస్సై ఏ శ్రీకాంత్



**బచ్చన్నపేట సెప్టెంబర్ 21 ( జనం సాక్షి):**వినాయక నిమజ్జనం శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని బచ్చన్నపేట ఎస్సై ఏ శ్రీకాంత్ అన్నారు.సోమవారం మండలంలోని పోచన్నపేట గ్రామంలో సర్పంచ్ ఫిరోజ్ అధ్యక్షతన వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొని, వినాయక నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలు మరియు ఏర్పాట్లపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.నిమజ్జనం సమయంలో చెరువులు, నీటి ప్రాంతాల్లో లోతు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ దిగరాదని, విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాలపై చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలను ప్రయాణించనివ్వకూడదని తెలిపారు.నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనడం, అసభ్యంగా నృత్యాలు చేయడం, ఇతరులతో ఘర్షణలకు దిగడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, పోలీసులకు సహకరిస్తూ నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ ఫిరోజ్, జీపీవో, గ్రామ పెద్దలు మరియు సుమారు 30 మంది వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు

# సైబర్ నేరగాళ్ల ఆట కట్టించిన పోలీసులు

### వివరాలు వెల్లడించిన ఎస్పీ డాక్టర్ శబరిష్, సీఐ సత్యనారాయణ, ఎస్సై క్రాంతి కిరణ్




**కేసముద్రం, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):**అడ్డదారిలో ధనార్జనే ధ్యేయంగా పోలీసులమంటూ నటిస్తూ బంగారు వ్యాపారులే లక్ష్యంగా పెట్టుకుని ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులకు పాల్పడి డిజిటల్ అరెస్టు పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నేరగాళ్లను కేసముద్రం పోలీసులు అరెస్టు చేశారు.నిందితుల నుండి సెల్ ఫోన్ తో పాటు పోలీస్ యూనిఫామ్ ను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తెలిపారు.నిందితులు నిడమనూరు గ్రామం నల్గొండ జిల్లా వాసులుగా గుర్తించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిందితులు పోలీస్ యూనిఫామ్ ధరించి ఫోటో తీసుకొని వాట్సప్,ట్రూ కాలర్లలో డిపి లలో ఉపయోగించి స్థానిక మండలానికి చెందిన ఓ బంగారు వ్యాపారి ఫోన్ నెంబర్ ను గూగుల్ ద్వారా సేకరించి ఈనెల 10న వ్యాపారికి పోలీస్ అధికారులమంటూ ఫోన్ చేసి ఇద్దరు దొంగలను పట్టుకున్నామని వారు దొంగలించిన బంగారాన్ని బాధితుడు కొనుగోలు చేశాడని అందుకు సంబంధించిన రసీదులు తమ వద్ద ఉన్నాయని,తాను కొనుగోలు చేసిన బంగారాన్ని రికవరీ గా ఇవ్వకపోతే అరెస్టు చేస్తామని భయభ్రాంతులకు గురిచేసి వ్యాపారి దగ్గర 88026 రూపాయలు అక్రమంగా వసూలు చేశారు.ఈ ఘటనపై ఎస్సై క్రాంతి కిరణ్ కేసు నమోదు చేయగా సిఐ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టి సాంకేతిక ఆధారాలతో చాకచక్యంగా నిందితులను గుర్తించారు.పోలీసుల పేరుతో ఫోన్ కాల్స్,డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు,ఆన్లైన్ డబ్బుల డిమాండ్ల పట్ల స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ శబరిష్ తెలిపారు. సైబర్ మోసానికి గురైతే 1930 కు కాల్ చేసి సంబంధిత సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

# తమ్ముడిని హత్య చేసిన అన్న అరెస్ట్

### 24 గంటల్లో కేసును ఛేదించిన గీసుగొండ పోలీసులు

### కత్తి,రక్తపు మరకలున్న దుస్తులు స్వాధీనం




**గీసుకొండ మండలం, సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**గరీబ్‌నగర్‌లో తమ్ముడిని కత్తితో పొడిచి హత్య చేసిన అన్నను గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ హత్య కేసును 24 గంటల్లో ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గరీబ్‌నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఈ నెల 19న రాత్రి సుమారు 9.30 గంటలకు ఎలుబాక ప్రసాద్(31) కత్తిపోట్లకు గురై మృతి చెందాడు.మృతుడి ఛాతి,వీపు,భుజంపై తీవ్ర గాయాలు గుర్తించారు. మృతుడి తల్లి ఎలుబాక సుజాత ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా మృతుడి అన్న ఎలుబాక ప్రవీణ్ (33)ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.తల్లి వద్ద తరచూ డబ్బులు అడిగే ప్రవీణ్‌ను ప్రసాద్ గతంలో పలుమార్లు మందలించడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగినట్లు తెలిసింది.దీంతో ప్రసాద్‌పై కక్ష పెంచుకున్న ప్రవీణ్..తల్లి సంపాదించే డబ్బు తనకే దక్కాలనే ఉద్దేశంతో తమ్ముడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.వెల్డర్‌గా పనిచేసే ప్రవీణ్ తాను తయారు చేసుకున్న కత్తిని వెంట తీసుకుని 19వ తేదీ రాత్రి గరీబ్‌నగర్‌లోని తల్లి,తమ్ముడు ఉంటున్న ఇంటికి వెళ్లాడు.ఆ సమయంలో తల్లి నైట్ డ్యూటీకి వెళ్లగా ప్రసాద్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు.కావాలనే ప్రసాద్‌తో గొడవకు దిగి,కత్తితో అతడి వీపు,ఛాతి,భుజంపై పలుమార్లు పొడిచాడు.తీవ్ర రక్తస్రావంతో ప్రసాద్ అక్కడికక్కడే కుప్పకూలాడు. ఇరుగుపొరుగువారు 108కు సమాచారం ఇవ్వగా, అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించి ప్రసాద్ మృతి చెందినట్లు నిర్ధారించారు.తమ్ముడిపై దాడి సమయంలో జరిగిన పెనుగులాటలో ప్రవీణ్ ఎడమ బొటనవేలుకు కూడా గాయమైంది.అనంతరం తన ఇంటికి వెళ్లి భార్యకు విషయం చెప్పిన ప్రవీణ్ తిరిగి తల్లి వద్దకు వచ్చాడు.తల్లి ప్రసాద్ మృతదేహం వద్ద ఏడుస్తుండగా.."ఏడిస్తే నిన్ను కూడా చంపుతాను.తమ్ముడిని చంపింది నేనే"అంటూ బెదిరించినట్లు పోలీసులు తెలిపారు.గాయపడిన ప్రవీణ్ 20వ తేదీ తెల్లవారుజామున 12.30 గంటల సమయంలో గీసుగొండలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడిని సంప్రదించాడు.గాయానికి కారణం అడగగా తమ్ముడిని కత్తితో పొడిచిన సమయంలో తన చేతికి గాయమైందని వైద్యుడికి చెప్పినట్లు పోలీసులు తెలిపారు.ప్రాథమిక చికిత్స అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోవాలని వైద్యుడు సూచించాడు.ఈ క్రమంలో 21వ తేదీన నిందితుడు తన ఇంటి వైపు వస్తున్నట్లు సమాచారం అందడంతో గీసుగొండ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించిన ప్రవీణ్ ఇచ్చిన సమాచారంతో అతని ఇంటి సమీపంలోని పొదల్లో దాచిన హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ జోన్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్లూస్ టీమ్ సంఘటనా స్థలంలో శాస్త్రీయ ఆధారాలను సేకరించింది.స్వాధీనం చేసుకున్న వస్తువులకు ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించారు.అనంతరం నిందితుడు ఎలుబాక ప్రవీణ్ (33) ను రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు.కేసును వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎస్ఐలు అనిల్ కుమార్,కుమార్,కానిస్టేబుళ్లు అరవింద్, విజయ్, ప్రవీణ్, భాస్కర్, రజినీకుమార్‌లను పోలీసు అధికారులు అభినందించారు.

## చెత్తను నాలుగు రకాలుగా విభజించి సేకరించాలి

### అదనపు కలెక్టర్ విజయలక్ష్మి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**జిల్లాలో చెత్తను నాలుగు రకాలుగా విభజించి సేకరించే విధానాన్ని అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఐడీఓసీలో వేస్ట్ మేనేజ్మెంట్ పై అధికారులతో సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పచ్చ డస్ట్ బిన్ లో తడి చెత్త, నీలం డస్ట్ బిన్ లో పొడి చెత్త, ఎరుపు డస్ట్ బిన్ లో శానిటరీ వ్యర్థాలు, నలుపు డస్ట్ బిన్ లో ఆసుపత్రి వ్యర్థాలు వేయాలని సూచించారు. విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ఆసుపత్రి వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించాలని ఆదేశించారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ రామ్మోహన్



**పెద్దవంగర సెప్టెంబర్ 21(జనం సాక్షి )** ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ రామ్మోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల నుండి 6 దరఖాస్తు 5 రెవిన్యూ శాఖకు 1 కరెంట్ డిపార్ట్మెంట్ వచ్చాయని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్ కుమార్, అధికారులు సోమన్న,తదితరులు పాల్గొన్నారు

## గణేష్ శోభాయాత్ర, నిమజ్జనాలు ప్రశాంతంగా నిర్వహించాలి

### అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి. అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 23, 24 తేదీల్లో జరిగే శోభాయాత్ర, నిమజ్జన ఏర్పాట్లపై సోమవారం ఐడీఓసీలో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గణపురం, కాళేశ్వరం నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్ లు అందుబాటులో ఉంచాలని, భక్తులు విద్యుత్ ప్రమాదాల పట్ల, ట్రాఫిక్ నిబంధనల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## కలెక్టరేట్ వద్ద ఉరుసు వాసుల నిరసన



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 21 ( జనం సాక్షి)** వరంగల్ నగరంలోని ఉరుసు సర్వేనెంబర్ 273, 274, 275, 276 లోని 17.05 ఎకరాల స్థలం లో సుమారు 60 సంవత్సరాలుగా ఉంటున్న ఎల్లమ్మ తాళ్ల, గౌడలు, దళిత కాలనీ వాసులు సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయంలో కలెక్టర్ చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా విన్నవించారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు

**టేకుమట్ల సెప్టెంబర్ 21 జనంసాక్షి** ::టేకుమట్ల మండలంలోని రామకృష్ణపూర్(వి) గ్రామంలోరైతులకు పకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు.సోమవారం మండల వ్యవసాయ అధికారి ఎం కళ్యాణి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ నాంపల్లి వీరేశం ఆధ్వర్యంలో వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడమే కాకుండా శాశ్వత ఆహారం అందించేందుకు ప్రకృతి వ్యవసాయం వరం లాంటిదని,సేంద్రియ వ్యవసాయం వల్ల నేలలోని సూక్ష్మజీవుల పెరుగుదలకు దోహదపడి నేల సారవంతం అవుతుంది అని తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం ఉండడం వలన మన గ్రామంలో రైతులు ఆరుతడి పంటలు సాగుచేయాలని సూచించారు.రైతులు పంటలకు విచక్షణారహితంగా ఎరువులు,పురుగుమందులు వాడడంవల్ల భూమిలోని భూసారం కోల్పోతుందని సూచించారు. సే ర్ఫ్ నోడల్ అధికారి ఎం మణికుమార్



మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించారు.జీవామృతం,ఘన జీవమృతం పంట సేంద్రియ ఎరువుల తయారీ విధానాలను రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మణికుమార్,విస్తరణ అధికారి రాహుల్, రైతులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ దృక్పథంతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 21 (జనం సాక్షి)** :విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని అలవర్చాలని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి సూచించారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవ సందర్భంగా సోమవారం ఆర్ట్స్ కళాశాల సోషల్ సైన్సెస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ప్రొఫెసర్ జ్యోతి పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూశాస్త్రీయ అవగాహనతోనే సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలు, అపోహలను తొలగించవచ్చని అన్నారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని ప్రశ్నిస్తూ, పరిశీలిస్తూ వాస్తవాలను తెలుసుకునే విధంగా ఆలోచనా శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని సమాజ అభివృద్ధికి ఉపయోగించేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు, ఎన్ఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ ఆలోచనా విధానం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మూఢనమ్మకాలను వీడి ప్రతి విషయాన్ని శాస్త్రీయ ఆధారాలతో పరిశీలించాలని విద్యార్థులకు సూచించారు. తప్పుడు సమాచారం, అపోహలను గుర్తించి వాస్తవాలను తెలుసుకోవడంలో శాస్త్రీయ దృక్పథం




కీలకమన్నారు. ప్రపంచంలో యుద్ధాల వల్ల నష్టాలే తప్ప లాభాలు లేవు అన్నారుఆర్థికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజకీయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి. విజయ్ కుమార్, డాక్టర్ శేషు, డాక్టర్ ఈ. అంజన్ రావు, డాక్టర్ వి. నవీన్, డాక్టర్ ఏ. రవీందర్, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ శంకర్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

### మాల మానాడు జిల్లా కన్వీనర్ చింతపండు చంద్రమౌళి

**స్టేషన్ ఘన్పూర్,సెప్టెంబర్ 21 (జనం సాక్షి)** : అంబేద్కర్ కల్పిత నాయకుడు అనే పుస్తకము వ్రాసి ప్రచురించిన హమారా ప్రసాద్ అనే వ్యక్తి చర్యను ఖండిస్తూ అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా కన్వీనర్ చింతపండు చంద్రమౌళి అన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, మేధావి, విద్యావేత్త అయినా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై హమారా ప్రసాద్ రచించిన పుస్తకంలో అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండి స్తున్నాం అని అన్నారు. కల్పిత నాయకుడు అంటూ పుస్తకంలో రాయడం అంబేద్కర్ చారిత్రక పాత్రను, మహోన్నత సేవలను అవమానపరచడ మే అని అన్నారు. అంబేద్కర్ కల్పిత నాయకుడు అనేపదజాలంతో అవమానిస్తే రాజ్యాంగాన్ని ప్రజా స్వామ్యాన్ని అవమానించడమేనని అన్నారు. హమారా ప్రసాద్ పై చట్టరీత్యా చర్య తీసుకోవాల ని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కల్పిత



నాయకు డు కాదని, ఒక వర్గానికి చెందిన నాయకుడు కాద ని, దేశమంతా గర్వించదగిన మహానాయకుడని కొనియాడారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కాపాడాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తెలంగాణ తొలి తరం ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కాపాడుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి టౌన్ అధ్యక్షులు, చిట్యాల మండల అధ్యక్షులు, పద్మశాలి సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్ విమానాశ్రయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

**పరకాల,సెప్టెంబర్21,(జనంసాక్షి):** ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధు డు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని సోమవా రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ మెండు రవీందర్, పట్టణ పద్మశాలి



సంఘం అధ్యక్షుడు బాసని దయాకర్,శ్రీనివాస్ చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు దార్న వేణుగోపాల్,మార్కండేయ చిట్స్ అధ్యక్షుడు రాచర్ల అశోక్,ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు డాక్టర్ మంత్రి కాశయ్య, దుంపేటి నాగరాజు, స్థానిక కౌన్సిలర్ పోరండ్ల మౌనిక వేణు, మాజీ కౌన్సిలర్ చిదురాల దేవేందర్, దార్న కుమారస్వామి,తౌటమ్ మధు, భాస్కర్, సామంతుల రాజేందర్, ఆడెపు కుమారస్వామి, దాసరి రమేష్, మంతెన సంతోష్, పల్నాటి రాజేందర్, సతీష్ పాల్గొన్నారు.

# చల్లగా ప్రారంభమైన భూముల రీ సర్వే



**చిట్యాల, సెప్టెంబర్ 21(జనం సాక్షి ):**మండలంలోని చల్లగరిగ గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. తొలుత గ్రామ సరిహద్దులను గుర్తించి నిర్వహణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లగరిగ గ్రామ సర్పంచ్ సిరిపెల్లి జంపయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, జూకల్ గ్రామ శివారు రైతులు పాల్గొన్నారు. మండల సర్వేయర్, చల్లగరిగ, జూకల్ గ్రామాల గ్రామ పంచాయతీ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

### ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన 16 ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విని, సంబంధిత సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి పైరవీలు, మధ్యవర్తులు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్ట ప్రకారం ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాదివాస్ ద్వారా ప్రజలకు మరింత చేరువవుతున్నామని తెలిపారు.

# గణపురం పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన అడిషనల్ ఎస్పీ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించే లక్ష్యంతో జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ సోమవారం గణపురం పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లోని రికార్డులు,



పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# చల్లగరిగెలో ప్రారంభమైన భూముల రీ సర్వే



**చిట్యాల, సెప్టెంబర్ 21(జనం సాక్షి ):**మండలంలోని చల్లగరిగ గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. తొలుత గ్రామ సరిహద్దులను గుర్తించి నిర్వహణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లగరిగ గ్రామ సర్పంచ్ సిరిపెల్లి జంపయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, జూకల్ గ్రామ శివారు రైతులు పాల్గొన్నారు. మండల సర్వేయర్, చల్లగరిగ, జూకల్ గ్రామాల గ్రామ పంచాయతీ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుల్లో రాణించాలి

### చెన్నారావుపేట తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ




**చెన్నారావుపేట, సెప్టెంబర్ 21 ( జనం సాక్షి):** విద్యార్థులు చదువుల్లో రాణించాలని చెన్నారావుపేట తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ అన్నారు. సోమవారం మండలంలోని అక్కల్ చెడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 28 మంది విద్యార్థులకు ప్రభుత్వం నుండి మంజూరైన షూస్, బెల్టులు, టైలు, ఒక జత దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని సూచించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన షూస్, బెల్టులు, టైలు, జత దుస్తులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్, గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్, మాజీ సర్పంచ్ తూటి పావని, మాజీ ఉపసర్పంచ్ బానోత్ వీరన్న నాయక్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు పులిశేరు రాజేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, పిఆర్టియు మండల అధ్యక్షులు పూజారి సురేందర్ గౌడ్, ఉపాధ్యాయురాలు సత్య పూర్ణిమ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలను సద్వినియోగం చేసుకోవాలి

### పాత మగ్దంపురం గ్రామ సర్పంచ్ ననుమస కర్ణాకర్



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 21 ( జనం సాక్షి):** ఇంకుడు గుంతలను సద్వినియోగం చేసుకోవాలని పాత మగ్దంపురం గ్రామ సర్పంచ్ ననుమస కర్ణాకర్ అన్నారు. సోమవారం మండలంలోనిపాత మగ్దంపురం గ్రామంలో విబిజిరామ్ జిఈజీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంకుడు గుంతలను (రైన్ హార్వెస్టింగ్ గుంతలు) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటింటికి ఇంకుడు గుంతలను తీసుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని వృధా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. భవిష్యత్‌లో నీటి కొరతను నివారించేందుకు వర్షపు నీటి సంరక్షణ ఎంతో అవసరమని గ్రామ ప్రజలు పూర్తిస్థాయిలో తమ ఇండ్లలో వాడుకున్న వృధా మురికి నీటిని రోడ్ల పైకి రాకుండా చూసుకోవాలి కోరారు. ఇంకుడు గుంతకు రూ.6 వేల 500, రైన్ హార్వెస్టింగ్ ఇంకుడు గుంత కు రూ. 13వేలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అలువాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ కుమారి, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు కట్టూరి లక్ష్మణాచారి, ఫీల్డ్ అసిస్టెంట్ పోగుల సురేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పత్యేక పూజలో ప్రజా ప్రతినిధులు

### గణేష్ ఉత్సవ కమిటీ మహా అన్నదానం



**డోర్నకల్ సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**గణేష్ ఉత్సవ కమిటీ నేతృత్వంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుర మాజీ వైస్ చైర్మన్ కోటిలింగం,పుర కమిషనర్ నాగరాజు,సీఐ చంద్రమౌళి,ఎస్సై రియాజ్ పాషా,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుమేర్ జైన్,11,12,15 వార్డు కౌన్సిలర్లు సంధ్యా వెంకటేష్, బడేటి రామ్ కోటేష్,గారే రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానాన్ని అధికారికంగా ప్రారంభించారు.సోషల్ మీడియా ఉపేందర్,పట్టణ ప్రజలు,భక్తులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పోటీలకు శ్రీ వివేకవర్ధిని విద్యార్థుల ఎంపిక



**కేసముద్రం,సెప్టెంబర్ 21 (జనం సాక్షి):** మండలంలోని పెనుగొండ గ్రామంలో ఈ నెల 18, 19 తేదీలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ జోనల్ స్థాయి క్రీడా పోటీలలో మహమూదుపట్నం శివారులోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ అండర్-17 విభాగంలో భూక్య విజయ్, అండర్-14 విభాగంలో భూక్య మోహన్, అజ్మీరా జ్ఞానేశ్వర్, కోకో అండర్-17 విభాగంలో వాంకుడోత్ భరత్, కుందే ప్రణయ్, వాంకుడోత్ నగేశ్, కోకో అండర్-14 విభాగంలో బానోత్ అనిరుద్, గుగులోతు నవదీప్, వాలీబాల్ అండర్-14 విభాగంలో చిలుకూరి శ్రీచందు, సపావట్ మోహన్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్, ప్రిన్సిపల్ చిర్ర నరేశ్ విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని, జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చి పాఠశాలకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకుల కృషి ఎంతో ఉందని కొనియాడారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నైన్‌పాక విద్యార్థినుల ప్రతిభ

**చిట్యాల, సెప్టెంబర్ 21(జనం సాక్షి ):**మండలంలోని నైన్‌పాక జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు తొట్ల వాగ్దేవి, పాలడుగుల మధుప్రియ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రసాద్ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వాగ్దేవి, మధుప్రియ ఈ నెల 19, 20 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగిన 11వ తెలంగాణ సబ్-జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. నైన్‌పాక పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలోనూ మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విద్యార్థినులకు, ఫిజికల్ డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాముకుంట్ల తిరుపతయ్య, ఉపాధ్యాయులు ప్రణీత, పల్లవి, ప్రవీణ్‌కుమార్, రఘు, రాజయ్య, నాగరాజు, రఘునాథ్, కోటేశ్వరరావు, సీఆర్‌పీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వర ఆలయం లో లక్ష్మీగణపతి మూల మంత్ర హవనం



**కాళేశ్వరం , సెప్టెంబర్ 21, ( జనం సాక్షి)**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం లోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ ఆది ముక్తేశ్వర స్వామి వారి ఆలయ బాలాలయం వద్ద నిర్వహిస్తున్న వరసిద్ధి వినాయక స్వామి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటలకు గణపతి షడక్షరి సహిత లక్ష్మీగణపతి మూలమంత్ర హవనాన్ని వేద పండితులు, అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద మంత్రోచ్ఛారణల మధ్య హోమం కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి, ధర్మకర్త గంధసిరి సత్యనారాయణతో పాటు ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## హాస్పిటల్లో చికిత్స పొందుతున్న మహిళను పరామర్శించిన మాజీ ఎంపీటీసీ ఆది సునీత రఘు



**టేకుమట్ల సెప్టెంబర్ 21 జనంసాక్షి :** టేకుమట్ల గ్రామానికి చెందిన రాం కుమారస్వామి భార్య రాం శారద ప్రమాదవశాత్తు కాలువలో పడగా కాలు ఫ్యాక్చర్ ఐ హనుమకొండ గార్డెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న టేకుమట్ల మాజీ ఎంపీటీసీ ఆది సునీత రఘు హుటాహుటిన గార్డెన్ హాస్పిటల్ కు చేరుకొని రామ్ శారదను పరామర్శించారు ఆనంతరం గార్డెన్ హాస్పిటల్ డాక్టర్లతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు డాక్టర్ చెప్పిన సూచనలు తప్పక పాటించి ఆమె తొందరగా కోలుకోవాలని ఆమెకు మనోధైర్యాన్ని కల్పించారు. ఆనంతరం ఆమెకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ,కోండ్ర ప్రశాంత్, కోండ్ర రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

## సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రమేష్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**సింగరేణి గనుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 1, 5, 6, 8 గనుల్లో మేనేజర్లకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గనుల్లో పనిచేసే కార్మికులకు నాణ్యమైన మైన్ షూస్, హెల్మెట్లు, రక్షణ పరికరాలు అందడం లేదని, డ్రిల్ బిట్స్, రెసిన్ క్యాప్సూల్స్ వంటి సామగ్రి కొరత ఉందన్నారు. పెండింగ్ లో ఉన్న మ్యాన్ రైడింగ్ పనులను పూర్తి చేయాలని, క్వార్టర్ అలాట్మెంట్ పారదర్శకంగా చేపట్టాలని, పెండింగ్ ప్రమోషన్లు, సీఎంపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

## సూపర్ స్పెషాలిటీ పనులను వేగంగా పూర్తి చేయాలి

### ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియాన ఆదేశాలు



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 21 (జనం సాక్షి)** :వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించేందుకు తెలంగాణ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్. చొంగ్తూ సోమవారం హనుమకొండకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆమెకు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాన్ని సందర్శించి జరుగుతున్న నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సమస్యలు పరిష్కరించరా

### కెరమెరి సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సర్పంచులు



**కెరమెరి, సెప్టెంబర్ 21(జనంసాక్షి)**కెరమెరి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై నివేదికలను సభ ముందు ఉంచారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పలువురు సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలు ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.సమావేశంలో తొలుత ఐకేపీ ఏపీఓ మల్లయ్య తమ శాఖకు సంబంధించిన నివేదికను సభ ముందు చదివి వినిపించారు. వీబీజీ రాంజీ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. అర్హులైన వారికి పనులు కల్పించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.అంగన్‌వాడీల్లో సిబ్బంది కొరతఐసీడీఎస్ అదనపు సీడీపీఓ ఉమాపతిమా మాట్లాడుతూ.. మండలంలో 91 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 60 మంది అంగన్‌వాడీ టీచర్లు, 37 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సిబ్బంది కొరత కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు.అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ తమ శాఖల నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యలకు ఇప్పటికీ పరిష్కారం చూపకపోవడంపై వారు మండిపడ్డారు.ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలునిషాని గ్రామంలో పలు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయని సర్పంచులు తెలిపారు. ఈ విషయమై పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాల పరిస్థితిని తెలియజేసే ఫొటోలను ఎంపీడీఓకు సమర్పించారు. వెంటనే సమస్యను పరిష్కరించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.పరందోలి గ్రామంలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, గత సమావేశంలోనే ఈ సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇంతవరకు పరిష్కారం కాలేదని సర్పంచులు పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలిమండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్ మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు చొరవ చూపాలని సూచించారు. పంట మార్పిడి విధానాన్ని పాటిస్తూ అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం వచ్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. రసాయన మందులను అవసరానికి మించి వినియోగించరాదని సూచించారు.ప్రస్తుతం పత్తి పంట ఏపుగా పెరిగినందున ఇకపై అవసరానికి మించి ఎరువులు వేయడం నిలిపివేయాలని రైతులకు సూచించారు. ఆధునిక, వినూత్న సాగు పద్ధతులను అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా వాణిజ్య పంటల సాగుపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులకు వ్యవసాయ శాఖ తరఫున అవసరమైన సూచనలు, సాంకేతిక సహకారం అందిస్తామని తెలిపారు.సమావేశంలో ఎంపీడీఓ అంజత్ పాషా, ఏవో యుగేందర్, డిప్యూటీ తహసీల్దార్ గేడం సంతోష్‌కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు ఆత్రం లక్ష్మణ్, కావుడే తులసీరాం, బల్వంత్‌నాయక్, అంబరావు తదితరులు పాల్గొన్నారు.

## కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమం



**కెరమెరి, సెప్టెంబర్ 21(జనంసాక్షి)**కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నాడు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాంకిడి సీఐ వేణుగోపాల్, కెరమెరి ఎస్సై రాజు పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన నష్టాల గురించి వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన ఎలాంటి అక్రమ కార్యకలాపాలు తమ దృష్టికి వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అదేవిధంగా, ఆన్‌లైన్ మోసాలు, ఓటిపి మోసాలు, ఫిషింగ్ లింకులు, సోషల్ మీడియా మోసాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటిపి, పాస్‌వర్డ్‌లు, పిన్ లు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు.విద్యార్థులు ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద సైబర్ కార్యకలాపం లేదా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

### బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయలు



**తాండూర్, సెప్టెంబర్ 21(జనం సాక్షి)**మంచిర్యాల: దేశంలోని బాలికల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం కేంద్రంలోని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని, బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చిలుముల శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి దేశ పౌరులని, విద్యార్థులంతా క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బాలికలు, మహిళల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతూ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. తన 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజా జీవితంలో మోదీ ఈ దేశానికి విశేష సేవలందించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కవిత, బీజేపీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహిధర్ గౌడ్, సీనియర్ నాయకులు, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్ పాల్గొన్నారు. అలాగే మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల కార్యదర్శి గాదె రాజేశం, మండల నాయకులు ఆవుల చందు, కామెర మహేష్, ఉపాధ్యాయురాలు సుమన చైతన్య మరియు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు పవర్ రామారావు పటేల్‌కు రజక సంఘం ఆహ్వానం



**కుంటాల, సెప్టెంబర్ 21(జనం సాక్షి ):**మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాల్సిందిగా కోరుతూ కుంటాల రజక సంఘం సభ్యులు నియోజకవర్గ ఎమ్ఎల్ఏ పవర్ రామారావు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ నెల 24వ తేదీ గురువారం నాడు కుంటాల మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనం పక్కన ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మరియు ఆవిష్కరణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రజక సంఘం ప్రతినిధులు తెలిపారు ఈ శుభకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. రజక సంఘం ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన రామారావు పటేల్, కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు.

## నంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం ఆయుర్వేదం, యోగాపై అవగాహన సదస్సు



**తాండూర్, సెప్టెంబర్ 21(జనం సాక్షి:**మంచిర్యాల జిల్లా : తాండూర్ మండలంలోని జడ్పీఎస్ఎస్ తంగళ్ళపల్లి, కేజీబీవీ తాండూర్, మరియు తంగళ్ళపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మరియు స్థానిక ప్రజలకు ఆయుర్వేదం, యోగాపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు వైద్యాధికారుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ నిత్య జీవితంలో ఆయుర్వేద వైద్య విధానం, యోగాసనాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగాను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య మేడం, ఫార్మసిస్ట్ వెంకటేశ్వరరావు, యోగ ఇన్స్పెక్టర్ విశ్వప్రసాద్, చంద్రశేఖర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన ఇసుక బహిరంగ వేలం

**ఖానాపూర్ సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**మండలంలోని సింగపూర్ గ్రామంలో అధికారులు సీజ్ చేసిన ఇసుకను బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగపూర్ జి పి ఓ, మండల గిర్దావర్ లు స్వాధీనం చేసుకున్న 20 ట్రాక్టర్ల ఇసుక దంపును అది ఉన్న ప్రదేశంలోనే వేలం వేస్తామని పేర్కొన్నారు. అత్యధిక ధర పాడిన వారికి ఇసుకను కేటాయిస్తామని, ఆసక్తి ఉన్నవారు రూ.5,000/- లు ముందస్తు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. వేలం ఈనెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని, అలాగే వేలంలో ఇసుక దక్కించుకోని వారికి వారు చెల్లించిన సొమ్మును తిరిగి ఇచ్చివేస్తామని వివరించారు.

## అల్లంవారి కుంట కబ్జాను అడ్డుకోవాలని గ్రామస్తుల రిలే నిరాహార దీక్ష



**జన్నారం, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):**జన్నారం మండలం రేండ్లగూడ గ్రామంలోని అల్లంవారి కుంట కబ్జాకు గురైందని ఆరోపిస్తూ, కుంటను పరిరక్షించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు.కుంటకు సంబంధించిన భూమిని కబ్జాల నుంచి కాపాడి, సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సముద్రాల శంకర్, ఆకుల మధుకర్, బాల్థ సుధాకర్, అల్లం సురేష్, అల్లం పెద్దయ్య, అల్లం గిరివర్మ, రవి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఆర్థికంగా ఎదగాలి

### మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్య



**కొత్తగూడ సెప్టెంబర్ 21జనంసాక్షి :** ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఆర్థికంగా బలపడి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని మాజీ శాసనసభ్యులు పోదెం వీరయ్య అన్నారు.మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో ఆయన సోమవారం పర్యటించారు.పర్యటనలో భాగంగా మాజీ సర్పంచ్ భూపతి శ్యామల తిరుపతి గృహాన్ని సందర్శించారు.అక్కడ ఉన్న శ్రేయోభిలాషులు , నాయకుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మారుమూల ఏజెన్సీ గ్రామాల ప్రజలు అన్ని రంగాల్లోనూ ముందడుగు వేయాలని, ఆర్థికంగా స్థిరపడినప్పుడే కుటుంబాలు, గ్రామాలు బాగుపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ సంఘం నాయకులు పూనెం సందీప్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవా అవగాహన సదస్సు



**పెద్దవంగర సెప్టెంబర్ 21(జనం సాక్షి )** పరిసరాల పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత సబీమ్ జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్, అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా భాగంగా విద్యార్థులకు స్వచ్ఛత, పరిశుభ్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నాలుగు రకాల డస్ట్‌బిన్లను సరైన విధంగా ఉపయోగించే విధానంపై హ్యాండ్స్-ఆన్ ప్రాక్టీస్ నిర్వహించారు. వివిధ రకాల వ్యర్థాలను గుర్తించి, వాటిని సంబంధిత డస్ట్‌బిన్‌లోనే వేయడం, వ్యర్థాలను వేరు చేసి సేకరించడం, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు.విద్యార్థులు స్వయంగా డస్ట్‌బిన్లను ఉపయోగిస్తూ వ్యర్థాల వేర్పాటుపై ప్రాక్టీస్ చేశారు.తడి వ్యర్థాలు--పొడి వ్యర్థాలు వేరు చేయడం, వ్యర్థాలను సరైన డస్ట్‌బిన్‌లో వేయడం, పరిసరాల పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతపరిశుభ్రమైన పాఠశాల, పరిశుభ్రమైన గ్రామం మరియు ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, ఎంఈఓ బుదారపు శ్రీనివాస్, ఉప సర్పంచ్, అనపురం వినోద్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బేబీ ఆరోహి జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు



**మల్లూర్, సెప్టెంబర్ 21(జనంసాక్షి)**మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి కుమార్తె బేబీ ఆరోహి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వార్డు సభ్యులు, స్థానిక సీనియర్ పాత్రికేయులు, గ్రామ పెద్దలు ఆరోహికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆరోహి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పైడాకుల దేవేంద్ర సమ్మయ్య,ఇందారపు రాజేశ్వరి పోచయ్య, ఇందారపు సారయ్య, తిర్రి అశోక్, పమ్మిడి నిరంజన్ రావు, కొత్తగొల్ల వనమ్మ రాజెలు, మేసం సంగీత రాకేష్, చల్లా మహేందర్, ఇందారపు శ్యామల శ్యామ్, పలువురు అధికారులు పాత్రికేయులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని నీరుగారుస్తున్న ఎంపీడీవో

**గంగారం, సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజల గడప వద్దకే పరిపాలన తీసుకెళ్లాలని మండల స్థాయిలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని జీవో ఎంఎస్ నెంబర్.4 ద్వారా ఆదేశాలు జారీ చేసింది. కానీ గంగారం మండలంలో మాత్రం ఈ ఆదేశాలు కాగితాలకే పరిమితం అయ్యాయి. గంగారం ఎంపీడీవో కార్యాలయం అతి చిన్న ఇరుకు గదిలో నడుస్తోంది. అందులో అధికారులు కూర్చోవడానికి కూడా స్థలం సరిపోవడం లేదు. దూరప్రాంతాల నుండి తమ సమస్యలతో వచ్చే గిరిజన, పేద ప్రజలకు కూర్చోవడానికి కుర్చీ లేదు, తాగడానికి మంచినీరు లేదు, ఎండ నుండి రక్షణకు టెంట్ లేదు. ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం ప్రతి ఎంపీడీవో ఆఫీస్ లో తాగునీరు, సీటింగ్, హెల్ప్ డెస్క్, టెంట్ ఏర్పాటు చేయాలని స్పష్టంగా చెప్పినా, గంగారం ఎంపీడీవో మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో వృద్ధులు, మహిళలు గంటల తరబడి ఎండలో నిలబడి అవస్థలు పడుతున్నారు. "ప్రజావాణి కోసం 20 కిలోమీటర్ల నుండి వస్తున్నాం, కనీసం కూర్చోడానికి కూడా చోటు లేదు. అధికారులు గదిలో



ఉండి, మమ్మల్ని వరండాలో కూడా ఉండనివ్వడం లేదు" అని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తున్న ఎంపీడీవో తీరుపై వెంటనే స్పందించి, గంగారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణకు అవసరమైన కనీస వసతులు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మాల్టలె న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలి

### ఎం ఆర్ ఓ కు వినతిపత్రం ఇచ్చిన హామాలి వర్కర్స్ యూనియన్ ఎఐటియూసి

**రేగొండ సెప్టెంబర్ 21( జనం సాక్షి):**మండల వ్యాప్తంగా ఉన్న హమాలి కూలీల కు పనికి తగ్గ కూలి గా 50కేజీ వడ్ల బస్తా కు గాను ఎగుమతి, దిగుమతి క్రింద 40 రూపాయలు చెల్లించాలని స్థానిక మండల తహసీల్దార్ కు సోమవారం వినతిపత్రం ను హమాలి వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం తరుపున అందచేశారు. ఈ సందర్భంగా మండల సిపిఐ కార్యదర్శి పెంట రవి,జిల్లా రైతు సంఘం కార్యదర్శి మామిడాల సమ్మిరెడ్డి,సహాయ కార్యదర్శి అన్నారపు రాజేందర్ లు మాట్లాడారు మండలం లో అన్ని గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యం, ఎరువుల దుకాణం లో ఎరువుల బస్తాలు, రైస్ మిల్లుల్లో, ఇతర ప్రాంతంలో రైతుల సౌకర్యార్థం బరువులు మోస్తూ వారి కుటుంబాలను పోషించు కుంటున్నారు.ఈ క్రమంలో బరువులు మోసి, మోసి వారి నడుములు కుంగి పోయి అనారోగ్యానికి గురి అవుతున్నారు, ఇటు నిత్యవసర ధరలు పెరగడం వచ్చిన కూలి సరిపోకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకుగాను 50కేజీ ల వడ్లబస్తకు ఒక్కంటికి 40 రూపాయలు, మ క్కలు క్వింటాలకు 100 రూపాయలు, పత్తికి




200 రూపాయలు, వడ్లకు 120 రూపాయలు ఇప్పించాలని ఎమ్మార్వోను కోరారు.అదేవిధంగా ఎగుమతి దిగుమతి పిండి బస్తాకు 50 కేజీలకు 40 రూపాయలు, నిత్యవసరవ ధరలు తగ్గించాలి, ఉచిత బీమా కల్పించాలి, ప్రమాదం జరిగినప్పుడు కార్పొరేట్ వైద్యం అందించాలి, అర్హత కలిగిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలి, ప్రభుత్వమే కార్మికులకు సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇవ్వాలి,అని తహసీల్దారును కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల హమాలి సంఘం , ఏఐటియుసి, రైతు సంఘంనాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు న్యాయం చేయాలి

### ప్రజావాణిలో పిర్యాదు చేసిన సర్పంచ్ భూక్య ఉమా మోహన్ నాయక్

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 21 ( జనం సాక్షి):** నిరుపేద కుటుంబాలకు న్యాయం చేయాలని బోడ మాణిక్యం తండా గ్రామ సర్పంచ్ భూక్య ఉమామోహన్ నాయక్ కోరారు.సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా వాణి కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట సాయి శివానంద్ కు ఫిర్యాదు చేశారు. బోడ మాణిక్యం తండా గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన చించావత్ విజయ రామ్ దస్, భూక్య విజయ వీరేందర్ లు ఇందిరమ్మ ఇళ్ల విషయములో ఆనాటి పంచాయతీ కార్యదర్శి, అధికారుల తప్పిదం వలన కిరాయికి ఉన్న వారి ఇళ్ల వద్ద ఫోటోలు తీయగా వారికి స్లాబులు ఉన్నట్లు ఎ3 లిస్టులో పడినందున వారికి న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్కడ సమస్య పరిష్కారం కానందున మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో చించావత్ విజయ రందన్ ల ప్రస్తుత ఇంటి ఫోటోతో ప్రజావాణిలో ఫిర్యాదు



చేసినట్లు తెలిపారు. ఈ విషయమై మండల అభివృద్ధి అధికారి వెంకట సాయి శివానంద్ వెంటనే స్పందించి హౌసింగ్ ఏఈ భవ్యని పిలిపించి ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి ద్వారా తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు.ఎంపిడివో వెంటనే స్పందించి ఆదేశాలు జారీ చేయడం పట్ల గ్రామ సర్పంచ్ భూక్య ఉమా మోహన్ నాయక్, బాధితులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

### ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతిపై అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష

**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 21 (జనం సాక్షి)** :కుడా పరిధిలో ఉన్న మండలాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కుడా పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతిపై అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయా మండలాల వారీగా పెండింగ్ లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. దరఖాస్తుదారులు పోర్టల్ లో అప్‌లోడ్ చేసిన పత్రాలు, క్షేత్రస్థాయిలో అధికారులు స్థల పరిశీలన చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కుడా సీపీవో అజిత్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కాన్ సెంటర్ ప్రారంభం

## ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్



**ఖానాపూర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి)**పట్టణంలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్‌ను సోమవారం స్థానిక ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిరుపేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గతంలో గర్భిణులు, మహిళలు అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షల కోసం వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు లేదా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిందన్నారు. ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానలోనే ఈ స్కానింగ్ సదుపాయం అందుబాటులోకి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ప్రాంతీయ ప్రజలకు, ముఖ్యంగా గర్భిణులు, మహిళలకు ఈ సేవలు ఎంతో మేలు చేకూరుస్తాయని, ఈ వసతిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రిలో ఎలాంటి మౌలిక వసతుల కొరత లేకుండా చూస్తామని, వైద్యులు, సిబ్బంది రోగులకు వేళాపాళ లేకుండా అందుబాటులో ఉంటూ అంకితభావంతో వైద్య సేవలందించాలని సూచించారు. నియోజకవర్గంలో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రాజేందర్, డిసిహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ సుజాత, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకం మౌనిక, వైస్ చైర్మన్ షోయబ్ హుస్సేన్, స్థానిక వైద్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు.



**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 21,(జనంసాక్షి )** ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీలకు స్వతంత్ర భారతదేశంలో ఉన్న హక్కుల కల్పించాలి

## ఏజెన్సీ సెడుల్ కులాల హక్కుల పోరాట సమితి , జేఏసీ అధ్యక్షుడు దౌనే ప్రకాష్



**జై నూర్, సెప్టెంబర్, 21(జనం సాక్షి)**స్వతంత్ర భారతదేశంలో ఉన్న హక్కులను ఏజెన్సీ ప్రాంత దళితులకు కల్పించాలని ఏజెన్సీ సెడుల్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ జిల్లా అధ్యక్షుడు దౌనే ప్రకాష్ అన్నారు. సోమవారం జైనూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశంలో ఉన్న రాజ్యాంగపరమైన హక్కులను ఎస్సీలకు కల్పించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రజా పాలనలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్నటువంటి ఎస్సీల భూములను వెంటనే పహానీలు ఇప్పించి బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు అందించాలని ఆయన అన్నారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో నివసిస్తూనటు వంటి ఎస్సీల కు పూర్తిస్థాయిగా ఇందిరమ్మ ఇండ్లు పథకాలను అమలు చేసి ఇందిర మైండ్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర భారతదేశంలో ఉన్నటువంటి ఎస్సీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ నుండి విడిపోయిన తెలంగాణలో ఎస్సీల జనాభా పెరిగిందని పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచి రిజర్వేషన్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో. మాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మా వాడే దత్త, ఏజెన్సీ షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు కాంబళే అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లపల్లి శంకర్, ఏజెన్సీ షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి మండల ఉపాధ్యక్షుడు వాగు మరి సంబాజీ, కోటంబె శ్రీహరి, వాగు మరి సంగ్రామ్, దేవ్ కాంబ్లే సాయిబ్ రావ్, కొమ్మే ప్రకాష్, గైక్వాడ్ మాధవ్, వాగ్ మారే పరశురాం, ప్రకాష్ ఎస్సీ కుల స్తుతులు పాల్గొన్నారు.

# విజయ్ సాయి పాఠశాలలో వినూత్నంగా 'పరిసరాలు-పరిశుభ్రత' పాఠ్యాంశ బోధన




**కుంటాల, సెప్టెంబర్ 21(జనం సాక్షి ):**పుస్తకాల్లోని పాఠాలను కేవలం చదవడమే కాకుండా, వాటి వెనుక ఉన్న శ్రమను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చూపించి సమాజం పట్ల బాధ్యతను పెంచేలా కుంటాల మండల కేంద్రంలోని విజయ సాయి పాఠశాల లో ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించారు పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు "పరిసరాలు - పరిశుభ్రత" అనే పాఠ్యాంశాన్ని వినూత్న రీతిలో బోధించింది. ఈ సందర్భంగా, ప్రతిరోజూ మన పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను మరియు కార్యాలయ సిబ్బందిని పాఠశాల వేదికపై గౌరవపూర్వకంగా సత్కరించారు. వారికి శాలువాలు కప్పి, మెమొంటోలను అందజేసి చిరు సత్కారం చేశారు. ఈ వినూత్న విద్యా బోధనా కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల గజేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజా బాపు, పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, కొరోబారి దిలీప్ మరియు పంచాయతీ సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా ఓ బీ సి మోర్చా కార్యదర్శి గా ఎనగందుల నారాయణ



**ఖానాపూర్ రూరల్ 21 సెప్టెంబర్ (జనం సాక్షి):** నిర్మల్ జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా నూతన కమిటీని ఎన్నుకున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు.జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బడి పోతున్న ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ ఓ బి సి మోర్చా నూతన కమిటీలో ఖానాపూర్ కి చెందిన సీనియర్ బిజెపి నాయకులు ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా ఎనగందుల నారాయణకు చోటు దక్కింది. ఈ సందర్భంగా ఎనగందుల నారాయణ మాట్లాడుతూ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శిగా బాధ్యతను ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి పార్టీ అభివృద్ధికి నా వంతు కృషి ఎల్లవేళలా అందిస్తానని ఎనగందుల నారాయణ అన్నారు.

# మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా శంకర్



**ఖానాపూర్ సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు తొంటి శంకర్ 'మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు'కు ఎంపికయ్యారు. విద్యాబోధనలో ఆయన చూపుతున్న అంకితభావానికి గాను ఈ గౌరవం లభించింది. ఆయాన మార్గదర్శకత్వంలో ఎంతోమంది విద్యార్థులు సైన్స్ ఫెయిర్లలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు.గత మూడేళ్లుగా పదవ తరగతి ఫలితాల్లో వరుసగా 100 శాతం ఉత్తీర్ణత సాధించడంలో కీలకపాత్ర పోషించారు. మస్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల రాష్ట్రస్థాయి గుర్తింపు పొందడంలో తనవంతు విశేష కృషి చేశారు.అవార్డు రావడం పట్ల శంకర్ సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ గుర్తింపు తనపై బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ అంక మౌనిక, మండల విద్యాధికారిని సంధ్యలు శంకర్ ను శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాన్ని, మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయండి

## - అదనపు కలెక్టర్ కు నీంగూడ గ్రామస్తుల వినతి



**కెరమెరి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి)**కెరమెరి మండలం నీంగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం నాడు ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.గ్రామ సర్పంచ్ వాడ్గులే రోజా-సోనాజీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...2026-27 విద్యా సంవత్సరంలో గ్రామ ప్రజలందరూ కలిసి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న వారి పిల్లలను తిరిగి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించామని, దీంతో విద్యార్థుల సంఖ్య 32 కు చేరిందని తెలిపారు. పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు నియమించినప్పటికీ, అందులో ఒకరైన శ్యామల అనే ఉపాధ్యాయురాలిని గత ఏడాది నుండి ఎంపీపీఎస్ గోయెగావ్ పాఠశాలకు డిప్యుటేషన్ పై పంపారని, దీంతో ఒక్క టీచర్ తోనే పాఠశాల నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పాఠశాల ప్రారంభమైన జూన్ నెల నుండి ఎంఆర్సి కెరమెరి వద్ద మండల విద్యాధికారి ఆడే ప్రకాష్ కు అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చినా, పోషకులు స్వయంగా వెళ్లి కోరిన పట్టించుకోలేదని ఆరోపించారు.పాఠశాల ప్రారంభమై 4 నెలలు గడిచినా ఒక్క ఉపాధ్యాయుడితో నాణ్యమైన విద్య అందించడం సాధ్యం కాదని, వెంటనే శ్యామల ఉపాధ్యాయురాలి డిప్యుటేషన్ రద్దు చేసి తిరిగి నీంగూడ పాఠశాలకు పంపించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. వారితోపాటు కెరమెరి మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరామ్,మునాజీ ఉన్నారు.

## నిర్మల్ జిల్లా మహిళా మోర్చా ఇన్‌చార్జిగా నల్లుల సంగీత



బెల్లంపల్లి, సెప్టెంబర్ 21, (జనంసాక్షి) బీజేపీ మహిళా మోర్చా నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది నల్లుల సంగీత నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆమెను నియమించారు. ఈ సందర్భంగా నల్లుల సంగీత మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, మహిళా మోర్చా విస్తరణకు కృషి చేస్తానన్నారు. నిర్మల్ జిల్లాలో మహిళలను పెద్ద సంఖ్యలో పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ సంస్థాగతంగా మహిళా మోర్చాను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## తాగునీరు సమస్యను పరిష్కరించాలని ప్రజావాణిలో ఫిర్యాదు




కాసిపేట సెప్టెంబర్ 21 ( జనం సాక్షి )కాసిపేట మండలంలోని పెద్ద ధర్మారం గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ మరియు పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, తెలంగాణ రక్షణ సేన కాసిపేట మండల ఇంచార్జి సోదరి సురేష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని, మురుగునీరు ఇళ్ల పరిసరాల్లో నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. దోమల బెడద కారణంగా ఇళ్లలో డెంగ్యూ మలేరియా వంటి జ్వరాలు వస్తున్నాయని, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే దోమల నివారణ చర్యలు, ఫాగింగ్, మురుగునీటి తొలగింపు చేపట్టాలని అధికారులను కోరారు.పెద్ద ధర్మారంలో తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల యువజన నాయకులు గంగాధరి రాజ్ కుమార్ మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## శతావధాన ప్రాశ్నికుడిగా డా. వెంకట్‌కు సన్మానం



నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 21,(జనంసాక్షి ): నిర్మల్‌కు చెందిన ప్రముఖ పద్యకవి, సంస్కృత భాషా ప్రచార సమితి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షుడు డా. బి. వెంకట్ హైదరాబాద్‌లో శతావధాన ప్రాశ్నిక సన్మానం అందుకున్నారు. బేగంపేట పుష్పగిరి మహాసంస్థానంలో నిర్వహించిన ప్రథమ శతావధాన కార్యక్రమంలో ఆయనకు శతావధాన ప్రతిభా పత్రం అందజేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 100 మంది ప్రాశ్నికులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో నిర్మల్ నుంచి డా. వెంకట్ ఒక్కరే పాల్గొన్నారు. దత్తపది విభాగంలో 'సంస్కృతభారతి--భారతీయ సంస్కృతి' అంశాలపై ప్రశ్నలు సంధించారు. కార్యక్రమంలో పుష్పగిరి పీఠాధిపతులు, అవధానులు, సాహితీవేత్తలు, సినీ నటుడు తనికెళ్ల భరణి, మహాసహస్రావధాని గరికపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన పాయింట్లు,రూట్ మ్యాప్స్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ నితికా పంత్

### విద్యుత్ తీగలు,హైటెన్షన్ వైర్ల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(జనంసాక్షి ):వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా,సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా ఎస్పీ నితికా పంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జన రూట్ మ్యాప్స్,నిమజ్జన పాయింట్లు,ఆయా ప్రాంతాల నుంచి నిమజ్జనానికి తరలించే వినాయక విగ్రహాల సంఖ్య తదితర వివరాలను పోలీస్ అధికారులు, సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే నిమజ్జన పాయింట్ల వద్ద ఏర్పాటు చేయాల్సిన బారికేడింగ్, లైటింగ్,ట్రాఫిక్ నియంత్రణ,పోలీస్ బందోబస్తు,క్రేన్లు,అత్యవసర సేవలు తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. వినాయక మండపాల నిర్వాహకులు,ఉత్సవ కమిటీ సభ్యులతో జిల్లా ఎస్పీ మాట్లాడి, నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు,అవసరాలు,ఎదురయ్యే సమస్యలు,వారి సూచనలను తెలుసుకున్నారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా పోలీస్ శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, వాహనాల రాకపోకల నియంత్రణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని,ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

## భూ సేకరణ, పునరావాస ప్రక్రియ వేగవంతం చేయాలి

### రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి




కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(జనంసాక్షి ):రాష్ట్రంలో చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంలో భూములు, ఇండ్లు కోల్పోతున్న వారికి మెరుగైన పరిహారం అందించి పునరావాసం కల్పించాలని జిల్లా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని సచివాలయం నుండి రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, నీటిపారుదల శాఖ కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంలో ముంపుకు గురయ్యే భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. భూములు, ఇండ్లు కోల్పోయే వారికి త్వరగా పరిహారం అందించి పునరావాసం కల్పించాలని, రైతులకు మెరుగైన మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలని తెలిపారు. భూ సేకరణ పునరావాస ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని, భూసేకరణ ప్రక్రియలో రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు తిరుపతి, భద్రయ్య, కె.వి. రమణ, వేణుగోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారిన వైకుంఠధామాలు



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(జనంసాక్షి ):జిల్లాలో వైకుంఠధామాలు సమస్యలకు వేదికలుగా మారాయి. అంత్యక్రియలు చేసేందుకు సరిపడా స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మౌలిక వసతులు కానరావడం లేదు. అంత్యక్రియల అనంతరం స్నానాలు చేసేందుకు నీరు కరువైంది. రూ.కోట్లు ఖర్చు చేసి వైకుంఠధామాలు నిర్మించినా నిర్వహణను పట్టించుకునేవారే లేకుండా పోయారు. జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్మాణాలు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఎందుకు పనికిరావడం లేదన్న విమర్శలున్నాయి. వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో కష్టాలు ఇక షరా మామూలే తమవారు చనిపోయిన బాధలో ఉన్నవాళ్లకు మరింత బాధను కలిగించేలా వైకుంఠధామాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని పల్లెల్లో నిర్మించిన వైకుంఠధామాల పరిస్థితి ప్రస్తుతం అధ్వాన్నంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ పథకం కింద 2018–19లో ఒక్కోదానికి నిర్మాణం కోసం రూ.12లక్షలు మంజూరు చేసింది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు చాలా గ్రామాల్లో అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. చిన్నపాటి సమస్యలను పరిష్కరిస్తే చాలా వరకు వినియోగంలోకి వస్తాయి. కానీ అధికారులు మాత్రం వీటిపై దృష్టి సారించని కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు.పల్లెప్రగతిలో భాగంగా.పల్లెప్రగతిలో భాగంగా ప్రతీ గ్రామంలోనూ వైకుంఠధామం నిర్మించారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలతో పాటు దాతల నుంచి సేకరించిన భూములను ఇందుకోసం కేటాయించారు. సొంతభూములు లేనివారికి ఇవి ఉపయోగపడతాయని భావించారు. దహనం చేసే గద్దెలతో పాటు స్నానాల గదులు, హాల్ నిర్మించారు. నీటి సౌకర్యం కోసం బోర్లు కూడా వేశారు. అయితే విద్యుత్ సౌకర్యం లేక బోర్లు పనిచేయడం లేదు. వైకుంఠధామాల వద్ద లైట్లు వెలగకపోవడంతో భయాందోళనకు గురవుతున్నారు. వైకుంఠధామాలకు వెళ్లడానికి దారులు లేక అంత్యక్రియలకు సైతం అటువైపు చూడటం లేదు. దీంతో గద్దెల చుట్టూ పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. గదులు, స్నానాల గదులు ధ్వంసమవుతున్నాయి. దీంతో నిర్వహణ లేక లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతున్నది. జిల్లా వ్యాప్తంగా..జిల్లాలో 15మండలాల పరిధిలో 335గ్రామపంచాయతీలు ఉన్నాయి. అన్ని పంచాయతీల పరిధిలో వైకుంఠధామాలను నిర్మించారు. అయితే వాటి నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి సారించకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. వైకుంఠధామాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో గ్రామాల్లో ఎవరైనా చనిపోతే గ్రామాల సమీపంలో వాగులు, చెరువుల వద్ద అంత్యక్రియలను చేస్తున్నారు. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన వైకుంఠధామాలు అలంకారప్రాయంగా మారాయి. లక్షలు వెచ్చించినా వినియోగంలో లేకపోవడం, వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పల్లెల్లో సైతం ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో అన్ని భూముల్లోనూ వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో దహన సంస్కారాలకు చోటులేకుండా పోయింది. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మిస్తే ప్రజలకు మేలు కలుగుతుందన్న అభిప్రాయంతో ఏర్పాటు చేసినా ప్రస్తుతం పట్టించుకోక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు వీటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గో విజ్ఞాన పుస్తకాల పంపిణీ.. గెలిస్తే లక్ష బహుమతి




**కుంటాల, సెప్టెంబర్ 21(జనం సాక్షి ):**భారతీయ సంస్కృతి, గోవుల విశిష్టతపై అవగాహన కోసం రాష్ట్రవ్యాప్తంగా గో విజ్ఞాన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్మల్ జిల్లా గో సేవ ప్రముఖ్ కొత్తకాపు నారాయణ తెలిపారు. సోమవారం కుంటాల జెడ్పీ హైస్కూల్, జూనియర్ కాలేజీ విద్యార్థులకు పరీక్షల అధ్యయన సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశల్లో జరిగే ఈ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి ₹1,00,000, ద్వితీయ స్థానానికి ₹50,000, తృతీయ స్థానానికి ₹25,000 బహుమతి ఇస్తామన్నారు. 10 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఈ పరీక్ష రాయవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో బండారి గజేందర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన తహసిల్దార్ కార్యాలయం

### ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన



**ఖానాపూర్ సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**నియోజకవర్గ కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ భవనం తీవ్రంగా దెబ్బతిని, ప్రమాదకర స్థితికి చేరుకుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పెంకుటిల్లు భవనం సకాలంలో మరమ్మతులు లేకపోవడంతో తీవ్రంగా శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పుల పెంకులు విరిగిపోయి, దూలాలు చెదలు పట్టి ముక్కలయ్యాయి. వర్షం కురిస్తే భవనంలోకి నీరు నేరుగా చేరుతోంది.భవనం గోడలు, పెంకులపై పిచ్చిమొక్కలు, నాచు దట్టంగా పెరిగిపోయి భవనం మనుగడకే ముప్పుగా మారాయి.కార్యాలయంలోని విద్యుత్ మీటర్లు, స్విచ్ బోర్డులు, విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. గోడలు తేమతో నిండి ఉండటంతో విద్యుత్ షాక్ లేదా షార్ట్ సర్క్యూట్ సంభవించే ప్రమాదం పొంచి ఉంది.ప్రభుత్వ అధికారులు స్పందించి, తక్షణమే నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### రాచాపూర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు



**లక్ష్మణ చందా, సెప్టెంబర్ 21 (జనం సాక్షి)** మండలంలోని రాచాపూర్ గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. పీహెచ్‌సీ న్యూ వెల్మల్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధుల లక్షణాలు ఉన్నవారిని పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కలుషిత నీటిని వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో జ్వరం, జలుబు, దగ్గు తదితర సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూసి ముత్యం, పంచాయతీ కార్యదర్శి శైలజ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్.



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(జనంసాక్షి ):**ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను తత్వమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని రెబ్బెన మండలం గోలేటి కి చెందిన లావుడ్య మమత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైనూర్ మండలం జంగాం గ్రామానికి చెందిన కొడప అనుతారావు తనకు దివ్యంగ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. సిర్పూర్ టి మండలం పారిగాం గ్రామానికి చెందిన దుర్కే విశ్వనాథ్ తనకు గతంలో పింఛను వచ్చి ఆగిపోయిందని తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన కాంబ్లే కీర్తికుమార్ తనకు ప్రభుత్వ వైద్య కళాశాలలో పొరుగు సేవలు కింద ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ పి మండల కేంద్రానికి చెందిన గద్దల రమేష్ తనకు విశ్వకర్మ పథకం కింద రుణ సదుపాయం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతల మానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన పిప్పిరే బాబాజీ తన వాటా భూమిని ఇతరులు ఆక్రమించినందున తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రత్నం పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు అర్జీదారులు పాల్గొన్నారు.

# జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 21, జనం సాక్షి:**:జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి రహదారి భద్రత సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాలు తగ్గించేందుకు, నివారణకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, ఇతర రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రహదారులపై వాహనాలు నిలపకుండా రహదారులు భవనాలు, పోలీసు శాఖల ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలు, ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో, అంతర్గత రహదారులలో




తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను అందుబాటులో ఉన్న గోశాలకు తరలించాలని, నూతన గోశాల ఏర్పాటుకు భూమిని కేటాయించడం జరిగిందని త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ జిల్లాలో 2026 సంవత్సరంలో ఇప్పటివరకు 429 ప్రమాదాలు జరిగాయని, ఈ ప్రమాదాలలో 95 మంది మృతి చెందారని తెలిపారు. జిల్లాలో ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి కన్నాల ప్రాంతంలో, నస్పూర్ లోని కలెక్టరేట్ కమాన్ ప్రాంతంలో రంబల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వస్తున్న ప్రజలకు నిరాశ

### అధికారుల తీరుపై మండల ప్రజల అసంతృప్తి



**గూడూరు,సెప్టెంబర్ 21(జనంసాక్షి):** ప్రజా సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం గూడూరు మండలంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి వివిధ సమస్యలతో ప్రజలు హాజరవుతున్నప్పటికీ, సంబంధిత శాఖల అధికారుల అందుబాటు, ఫిర్యాదుల పరిష్కారంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశతో గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి వస్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ప్రధాన శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో లేకపోవడం, ఉన్నతాధికారుల సమక్షంలో తమ సమస్యలను వివరించే అవకాశం లేకపోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారని ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం వాటి పురోగతిపై సమాచారం అందకపోవడం కూడా ప్రజలకు ఇబ్బందిగా మారుతోందని పలువురు చెబుతున్నారు.ఫిర్యాదులపై పర్యవేక్షణ ఏదీ..ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటి పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలిప్రజావాణి కార్యక్రమానికి మండలంలోని అన్ని ప్రధాన శాఖల అధికారులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ శాఖలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచిస్తున్నారు. ప్రజలు పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ఒకే వేదికపై సమస్యలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.విజ్ఞప్తి చేస్తున్నారు.ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. గూడూరు మండలంలో ప్రజావాణి కార్యక్రమం సమర్ధవంతంగా నిర్వహించేలా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించేలా సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమం కేవలం సమావేశానికే పరిమితం కాకుండా, ఆచరణలో ఫలితాలు అందించే వేదికగా మారాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించాలి

- **రేషన్ షాపులో 13 రకాల నిత్యవసర వస్తువులు ప్రజలకు అందించాలి**
- **ఏ ఐ ఎఫ్ డి డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగాల రాగసుధ**

**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 21( జనం సాక్షి) :** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపుల భాగంగా సోమవారం హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వంగాల రాగసుధ మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతూ సామాన్య ప్రజల జీవితాలను తీవ్ర సంక్షోభంలోకి నటి వేస్తున్నాయి. బియ్యం, పప్పు, వంట నూనెలు, కూరగాయలు, పాలు, గుడ్లు ఇతర నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో కుటుంబాల నెలవారి ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ధరల పెరుగుదల ప్రభావాన్ని మొట్టమొదటిగా అత్యంత తీవ్రంగా ఎదుర్కొంటున్నది మహిళలే ఇంటి బడ్జెట్ ను నిర్వహించే బాధ్యత ఎక్కువగా మహిళపై ఉండటంతో ధరల పెరిగిన ప్రతిసారి తమ కుటుంబాల అవసరాలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పిల్లల పోషకాహారం, విద్య, ఆరోగ్యం దుస్తులు వంటి అవసరాలపైన ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తుంది, మంట ఆరిపోకుండా చూడాల్సిన మహిళ చేతిలో నేడు ఖాళీ సంచి మిగులుతుంది కూరగాయల ధరల పెరుగుతే కూర తగ్గుతుంది పప్పు ధరలు పెరుగుతే పప్పు తగ్గుతుంది నూనె ధరలు పెరిగితే వంటలపై కోతపడుతుంది ఇది కేవలం ధరల పెరుగుదల కాదు ప్రజల జీవన హక్కు పై బడుతున్న భారమైన పెద్ద దెబ్బ ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని కాపాడాల్సిన సమయంలో మార్కెట్ ధర నియంత్రణ నిర్లక్ష్యం చేయడం వల్ల దళారులు అక్రమ నిల్వదారులు అధిక లాభ కోసం వ్యవహరించే వ్యాపారాలు ప్రజలను దోచుకునే పరిస్థితి ఏర్పడుతుంది.తక్షణమే




నిత్యవసర వస్తువులు రేషన్ షాప్ ద్వారా ప్రజలకు 13 రకాల వస్తువులు ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాంలేనియెడల అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నబోయిన ప్రేమలత, ప్రత్యూష, జిల్లా కమిటీ సభ్యులు ఏన్ రెడ్డి రాజేంద్ర, గడ్డం సుధారాణి, అరుణ, లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

## జెసిబి సీజ్



**ఖానాపూర్ సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** పట్టణ పొలిమేరలోని రెంకొని వాగులో అక్రమంగా ఇసుక తోడుతున్న జెసిబి తోపాటు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను సీజ్ చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్ తో పాటు జెసిబిని ఉన్నతాధికారుల సూచనల మేరకు మైనింగ్ శాఖకు నివేదించినట్లు వివరించారు.

## ఆశ్రమ పాఠశాలల పై ఐటిడిఏ పీఓ కి వినతి



**నూగూర్ వెంకటాపురం సెప్టెంబర్ 21(జనం సాక్షి ):** ఆదివాసీ నవ నిర్మాణ సేన నాయకులు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై ఏటూరు నాగారం ఐటిడిఏ పి ఓ లెనిన్ వత్సల్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ విద్యార్థులు చదువు సరిగా అందక, ఉపాధ్యాయులు లేక,సరైన సౌకర్యాలు లేకపోవడంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పేర్కొన్నారు. అలాగే వాజేడు మండల పరిధిలోని పెద్ద గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో మూడు సంవత్సరాల నుండి హిందీ, బయాలజీ, సోషల్ సబ్జెక్ట్ లకు సంబంధించిన ఉపాధ్యాయులు లేక పాఠాలు సరిగా బోధించక పిల్లలు చదువుకోవడం ఇబ్బందిగా ఉందని, చదువు సరిగా రాక ఏజెన్సీ పిల్లలు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఏటూరు నాగారం తరలించిన గురుకుల పాఠశాలను వెంటనే వాజేడుకు తరలించాలని, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎన్ ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు పాయం అజయ్, ఏ ఎన్ ఎస్ వాజేడు మండల నాయకు తల్లడి. ప్రసాద్, తల్లడి సంతోష్, కోరం మనోజ్, పీర్ల రవిరాజు పాల్గొన్నారు.

## మొక్క జొన్నల కొనుగోలులో రైతులకు అన్యాయం

**కమలాపూర్, సెప్టెంబర్ 21 ( జనం సాక్షి ) :** కమలాపూర్ మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన మొక్కజొన్నలకు సంబంధించి అక్రమాలు జరిగాయని, వెంటనే విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో గుండె బాబు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎసిఎస్ కొనుగోలు ప్రక్రియలో అనేకమంది రైతులు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 233 మంది రైతులకు 1200 నుండి 20 వేల వరకు తక్కువగా డబ్బులు చెల్లించారని అన్నారు. 800 మందికి పైగా రైతులకు నేటికి ట్రక్ షీట్ డబ్బులు చెల్లించలేదన్నారు. కొంత మంది రైతులకు గన్ని బ్యాగులకు సంబంధించి రావలసిన మొత్తాన్ని కూడా రైతుల ఖాతాలో జమ చేయలేదని అన్నారు. గతంలో జిల్లా కలెక్టర్ కి ప్రజావాణిలో పిర్యాదు చేయడం జరిగిందని,ఆ సమయంలో జ్యోతి గో డౌన్ వారు నష్టపోయిన రైతులకు త్వరలోనే డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని గుర్తు చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఈ




అంశంపై గుర్తిస్థాయి విచారణ జరిపి రైతులకు రావలసిన బాకీలను చెల్లించి తగిన న్యాయం చేయాలని కోరారు. కింది స్థాయి అధికారులు చేస్తున్న తప్పులకు ప్రభుత్వం పై చెడ్డ పేరు వస్తుందని,ప్రభుత్వానికి మచ్చ తెచ్చే అధికారుల పై కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రిక్కల నారాయణ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండ తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

## గిరిజన దర్బార్ లో సమర్పించిన దరఖాస్తులకు

# సత్వర పరిష్కారం చూపాలి

**ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో**

**ఏటూరు నాగారం, సెప్టెంబర్ 21(జనం సాక్షి) :** ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో,గిరిజనుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా గిరిజన దర్బార్‌లో స్వీకరించిన దరఖాస్తులను తక్షణ ప్రాధాన్యతతో పరిశీలించి, సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ గిరిజన దర్బార్‌లో మొత్తం 27 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో విద్యా విభాగానికి సంబంధించి 15, పోడు భూములకు సంబంధించి 3, జీవనోపాధికి సంబంధించి 4, బోర్‌వెల్ మరియు విద్యుత్ లైన్‌కు సంబంధించి 2, మావోయిస్టుల లొంగుబాటు అనంతరం జీవనోపాధికి



సంబంధించి 1 దరఖాస్తు ఉన్నాయి.అలాగే ట్రైబల్ రిలీఫ్ ఫండ్ కు సంబంధించి 2, గ్రామ పంచాయతీ భవనం పెండింగ్ పనులకు సంబంధించి 1 దరఖాస్తు ఉన్నట్లు అధికారులు తెలిపారు.ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలు క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీ జానార్ధన్, ఏపీఓ దామోదర స్వామి, ఏఓ అనిల్ కుమార్, ఈఈ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

నిర్వహించానని, తనకు రావలసిన వేతనం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అంతకుముందు జిల్లాలోని మందమర్రి మున్సిపల్ పరిధిలోని శ్రీపతి నగర్ లో అక్షర యూత్ గణేష్ మండలి వారు ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడిని మున్సిపల్ కమిషనర్ రాజలింగు తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక మండలి వారు మట్టి వినాయకుడిని పూజించడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో అన్ని గణేష్ మండళ్ల నిర్వాహకులు మట్టి వినాయకుని పూజించాలని తెలిపారు. వినాయక విగ్రహాల తయారీకి వినియోగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ రంగుల ద్వారా వాయు, జల, నేల కాలుష్యం జరుగుతుందని, ఈ కాలుష్యాన్ని నియంత్రించే మట్టి వినాయకులను పూజించాలని తెలిపారు.

## దేవుడి మాన్యం భూమికి సరిహద్దులు ఏర్పాటు చేయాలి




**పర్వతగిరి, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** పర్వతగిరి మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి దేవస్థానానికి సంబంధించిన భూమిని సర్వే చేసి, హద్దులు నిర్ణయించి సంరక్షించాలని కోరుతూ దేవస్థానం సభ్యులు మండల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దేవస్థానానికి సంబంధించిన సర్వే నంబర్లు 932, 933, 934లో మొత్తం 4 ఎకరాల 5 గుంటల భూమి ఉండాల్సి ఉండగా, భూమిపై అనుమానం రావడంతో దేవస్థానం సభ్యులు ఇటీవల కొలతలు వేయించినట్లు తెలిపారు. కొలతల్లో 3 ఎకరాల 22 గుంటల భూమి మాత్రమే ఉన్నట్లు తేలిందని, మిగిలిన 23 గుంటల భూమి కనిపించకపోవడంతో కొందరు వ్యక్తులు ఆక్రమించి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. దేవస్థానానికి చెందిన మాన్యం భూమి కావడంతో అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి, అసలు విస్తీర్ణాన్ని నిర్ధారించి, భూమికి స్పష్టమైన సరిహద్దులు ఏర్పాటు చేయాలని వారు ప్రజావాణిలో కోరారు. దేవస్థానం భూమిని రక్షించేందుకు రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల స్వామి దేవస్థానం సభ్యులు, వేణుగోపాల స్వామి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువు నీటిని విడుదల చేయాలని రైతుల వినతి

**బయ్యారం సెప్టెంబర్ 21(జనంసాక్షి) :** బయ్యారం పెద్ద చెరువు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా బయ్యారం తహసిల్దార్ కు ఎంపీడీవోకు రైతులు వినతిపత్రం సమర్పించారు. చెరువు నిండి అలుగు పోస్తున్నప్పటికీ తూములు ఎత్తి నీటిని విడుదల చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల క్రితం నీటిని వదిలి ఒక్క రోజులోనే మళ్ళీ తూములు కట్టేశారని అధికారులకు తెలిపారు.

వేసిన పంటలు ఎండి పోతున్నాయని తక్షణమే నీటిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. .దీనిపై స్పందించిన అధికారులు వెంటనే నీటి పారుదల శాఖ అధికారులు డి . ఈ. నాగార్జున సాగర్, ఏ ఈ లను చరవాణి ద్వారా వివరణ కోరగా కాల్వలు భాగాలేవని అదేవిధంగా బీళ్లు గావున్న రైతులు అభ్యంతరం చెపుతున్నారని తెలిపారు. రైతులు వెంటనే నీటిని విడుదల చేయాలనీ కోరుతూ తహసీల్దార్ కు, ఎంపిడిఓ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో రైతులు నంబూరి మదు, ముల్కూరి జగ్గన్న, వీరబోయిన భూషయ్య, యరసంగి పాపయ్య,సూరం వెంకటరెడ్డి,కొత్త సోమిరెడ్డి, రవీందర్ రెడ్డి, గండ్రాతి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మొదట ఫైర్.. తర్వాత కూల్!

- లక్ష్మణ చందా లో మండల స్థాయి సమీక్ష సమావేశం
- అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం
- నెల రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశం
- సమావేశానికి గైర్హాజరైన విద్యుత్ శాఖ ఏఈ



**లక్ష్మణ చందా, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):** లక్ష్మణ చందా మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశం తొలుత కొంత వాడీవేడిగా సాగింది. అనంతరం శాఖల వారీగా వివరాలు తెలుసుకుంటూ సమావేశం ప్రశాంతంగా కొనసాగింది. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, వ్యవసాయం, సాగునీరు, పంచాయతీరాజ్, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలపై ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అధికారులను, ప్రజాప్రతినిధులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక అధికారి శంకర్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభమైంది. తొలుత వ్యవసాయ శాఖకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. మండలంలో గత 44 రోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఇప్పటివరకు 744 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు. మండలంలో మొత్తం 9,408 మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు సుమారు 8,500 మంది రైతుల ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తయిందని తెలిపారు. పంటల నమోదు ప్రక్రియను కూడా తప్పనిసరిగా చేపడుతున్నట్లు వెల్లడించారు.

**యూరియా వినియోగంపై సమీక్ష**

ఎరువుల సరఫరాపై కూడా అధికారులు వివరాలు వెల్లడించారు. మండలానికి ఇప్పటివరకు 33,343 యూరియా బస్తాలు రాగా, అందులో ఒక్క నెలలోనే 16,747 బస్తాలను రైతులు తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువుల కొరత లేకుండా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

**సరస్వతి కెనాల్ కింద 8,769 ఎకరాల సాగు**

నీటిపారుదల శాఖపై జరిగిన సమీక్షలో సరస్వతి కెనాల్ కింద మండలంలో 8,769 ఎకరాలు సాగులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. నీటి లభ్యతకు అనుగుణంగా వారాబందీ విధానం అమలు చేస్తున్నట్లు వివరించారు. సాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు.

**పంచాయతీరాజ్ పనులపై ఆరా**

పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన అంశాలపై చర్చ సందర్భంగా భూ సమస్యల కారణంగా కొన్ని గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. మండలంలో మరో రెండు గ్రామపంచాయతీ భవనాలు ప్రతిపాదన దశలో ఉన్నట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న భవనాల పనులను నెల రోజుల్లో ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మునిపెల్లి నుంచి ధర్మారం వరకు, చామన్‌పల్లి నుంచి మునిపెల్లి వరకు బీటీ రోడ్లు మంజూరు చేసి నిర్మించాలని ఆయా గ్రామాల సర్పంచులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

**ఇందిరమ్మ ఇళ్లపై ఎమ్మెల్యే ఆగ్రహం**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. నిర్మాణ పనులు పూర్తయిన దశకు అనుగుణంగా లబ్ధిదారులకు బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని సర్పంచులు కోరారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిపై ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆరా తీశారు. ఏఈ విశాల్ నెల రోజుల్లోగా ప్రతి గ్రామాన్ని సందర్శించి సంబంధిత సర్పంచులను కలిసి పనుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయంలో ఈ ప్రక్రియ పూర్తి చేయకపోతే మరుసటి రోజే సరెండర్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం కావాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**విద్యుత్ శాఖ ఏఈ గైర్హాజరు**

మండల స్థాయి సమీక్ష సమావేశానికి విద్యుత్ శాఖ ఏఈ మహేష్ గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. మండల స్థాయి సమీక్ష వంటి ముఖ్యమైన సమావేశానికి సంబంధిత శాఖ అధికారి హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తమైనట్లు తెలిసింది. అన్ని శాఖల అధికారులు సమీక్ష సమావేశాలకు తప్పనిసరిగా హాజరై తమ శాఖకు సంబంధించిన సమస్యలు, పురోగతిని వివరించాలని సూచించారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను శాఖల మధ్య సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, పెండింగ్‌లో ఉన్న పనులను నెల రోజుల్లోగా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు. తొలుత వాడీవేడిగా సాగిన సమావేశం అనంతరం శాఖల వారీగా వివరాలు తెలుసుకోవడంతో ప్రశాంతంగా ముగిసింది. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, ఎంపీడీవో వనజ, ఎమ్మార్వో సరిత, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు ప్రతినిధి,సెప్టెంబర్ 21(జనం సాక్షి):** ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకుండా సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్లు సి. హెచ్. మహేందర్, ఎం. సంపత్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి రవి కుమార్ లతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు.ప్రజావాణిలో మొత్తం 30 దరఖాస్తులు అందగా, వాటిలో భూ సమస్యలకు సంబంధించినవి 08, ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించినవి 05, పింఛన్లకు సంబంధించినవి 04, ఉద్యోగాలకు సంబంధించి 06, ఇతర శాఖలకు సంబంధించినవి 07 ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి, పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా, ప్రజలకు జవాబుదారీ తనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ తహసీల్దారును సస్పెండ్ చేయాలి

**ప్రజావాణిలో బాధిత కుటుంబాలు ధర్నా**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(జనంసాక్షి) :** ఆసిఫాబాద్ తహసీల్దార్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాప్రి గ్రామానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజావాణి వేదిక ఎదుట బైఠాయించి తహసీల్దార్కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సామేల గ్రామ శివారులో కాప్రి గ్రామానికి చెందిన మృతుడు ద్వార సోముకు చెందిన సుమారు 20 ఎకరాల భూమిని కొడుకు దాముకు విరాసత్ చేసేందుకు మీ సేవలో రూ. 1. 20 వేలు చెల్లించి స్లాట్ బుకింగ్ చేసి, తహసీల్దార్ వద్దకు వెళితే విరాసత్ చేయకుండా ఆపి, తమ భూమిని కబ్జాలో ఉన్న వ్యక్తికే రాసి ఇవ్వాలని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లు తమపై ఒత్తిడి చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని 9న, 16న, 23-03-2026న వరుసగా ప్రజావాణిలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తే విరాసత్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అయినప్పటికీ పట్టించుకోకుండా తప్పుడు రికార్డులు సృష్టించి, అధికారులను తప్పుదోవ పట్టిస్తూ తమను కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఇచ్చిన మాట ప్రకారం ఘనపూర్‌ను మున్సిపాలిటీ చేశా

**... స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 21 (జనం సాక్షి ) :** ఎన్నికల అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం స్టేషన్ ఘనపూర్ ను మున్సిపాలిటీ చేశానని, మున్సిపా లిటీ అభివృద్ధికి 50కోట్ల నిధులు మంజూరు చేయించానని, రాజకీయాలలో సిగ్గులేని వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే అది మాజీ ఎమ్మెల్యే రాజయ్యనేనని, రాజయ్య డకౌట్ కాలేదని హిట్ వికెట్ ద్వారా సెల్ఫ్ గోల్ కొట్టుకున్నాడని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ లో నిర్వహించిన స్టేషన్ ఘనపూర్ పట్టణ, వార్డు, అనుబంధ కమిటీల పరిచయకార్యక్రమం,పట్టణ విస్తృత స్థాయి సమా వేశానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంబాటి కిషన్ రాజ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కొత్తగా ఎన్నికై న పట్టణ కమిటీ కార్యవర్గ సభ్యులు, వార్డు అధ్య క్షులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రాజకీయాలలో నాలుగుసార్లు ఎమ్మెల్యే గా గెలిచిన వ్యక్తిని ఉప ముఖ్యమంత్రి పదవి నుండి భర్తరఫ్ చేసి కనీసం ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వలేదు అంటే ఇంతకంటే సిగ్గుచేటు ఇంకా ఏమైనా ఉంటుందా అని ఏద్దేవా చేశారు. వాళ్ళు వాళ్ళ స్థాయిని మించి సభ్యత సంస్కారం లేకుండా హీనంగా మాట్లాడుతున్నారని అలాంటి వాళ్ళను ప్రజలు కూడా హీనంగానే చూస్తారని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి 50కోట్లు మంజూరు చేయించానని, ఇప్పటికే కొన్ని



పనులు కొనసాగుతున్నాయని, అతి త్వరలోనే 50కోట్ల పూర్తి పనులు ప్రారంభం అవుతాయాని వెల్లడించారు. వీటితో పాటు ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి మరో 8కోట్లు మంజూ రు అయ్యాయని తెలిపారు. మున్సిపాలిటీలోని ప్రతీ వార్డుకు 15లక్షల అభివృద్ధి నిధులు, 10 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అలాగే స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ నుండి కుడి కాలువ ద్వారా కాలువ మరమ్మత్తు లు చేసి మున్సిపాలిటీ రైతులకు సాగు నీరు అందిస్తున్నట్లు తెలిపారు. బిఆర్ఎస్, బీజేపీ పార్టీ లు కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారాలు చేస్తున్నా యని బిఆర్ఎస్, బీజేపీల దాడిని తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, పట్టణ కాంగ్రె స్ పార్టీ అధ్యక్షుడు అంబాటి కిషన్ రాజ్, మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నీల రాజమ్మ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు అధ్యక్షులు, పట్టణ కమిటీ కార్య వర్గ సభ్యులు, జిల్లా, మండల స్థాయి నాయకు లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మండలస్థాయి ఎస్ జీ ఎఫ్ క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందన



**మహదేవపూర్: సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మహదేవపూర్ మండల కేంద్రంలో ఈ నేల 21,న ఎస్ జీ ఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత మహదేవపూర్ బాలుర పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు.అండర్-14 వాలీబాల్ ఫస్ట్ ప్లేస్ అండర్ 17 ఖో ఖో , ఫస్ట్ ప్లేస్, అండర్ 14 ఖోఖో , ఫస్ట్ ప్లేస్ సాధించారు.గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు. అనిల్ కుమార్. సైన్స్ ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి. తిరుపతి రెడ్డి. సీనియర్ ఉపాధ్యాయులు బండంరాజిరెడ్డి మాట్లాడుతూ. ఈకీడ్రాల్లో పి డి రమేష్ శిక్షణ ఎంతో దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బడం రాజిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బి తిరుపతిరెడ్డి, రాజయ్య,లచ్చయ్య, సమ్మయ్య,అనిత, కవిత,కిరణ్ కుమార్, శ్రీనివాస్, రమాదేవిలు పాల్గొన్నారు.జిల్లా స్థాయి పోటీలలో కూడా విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.